# నవజ్యోతి
తెలుగు దినపత్రిక

ప్రచురణ: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | సంపుటి: 01 సంచిక : 249 | ఎడిటర్.: మన్నే లక్ష్మణ్ | వెల:5/- | పేజీలు: 8 | శనివారం 27-06-2026


## మ్యాన్‌హోల్స్ సమస్యతో ఇళ్లలోకి చేరుతున్న వర్షపు నీరు



- రాజీవ్ గృహకల్పలో డ్రైనేజీ సమస్యలపై వినోద్ కుమార్ తక్షణ స్పందన
- డ్రైనేజీ క్లీనింగ్ తో ఊపిరి పీల్చుకున్న స్థానికులు

6

## ప్రభుత్వ భూమిపై అక్రమ నిర్మాణాలు కలకలం

- నాగారంలో 1,184 గజాల ఆక్రమణ గుర్తింపు
- దర్యాప్తులో అక్రమమని తేలితే కూల్చివేత తప్పదని అధికారుల హెచ్చరిక



6

## ఈ నెల 28న పల్స్ పోలియో కార్యక్రమం



2

- ఒక్క చిన్నారి కూడా మిగలొద్దని మంత్రి దామోదర్ ఆదేశం
- రాష్ట్రవ్యాప్తంగా 22,979 పోలియో బూత్‌ల ఏర్పాటు

## తెలంగాణ కొత్త సీఎస్‌గా సంజయ్ జాజు



- జులై 1 నుంచి బాధ్యతలు స్వీకరణ
- కేంద్ర సర్వీసుల నుంచి పేరెంట్ కేడర్‌కు బదిలీ

2



# అసైన్డ్ భూముల విషయంలో పేదలకు అండగా ఉంటాం

## కేటీఆర్

- పరిగి బీఆర్ఎస్ సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు
- అవసరమైతే న్యాయ పోరాటం చేస్తామని వెల్లడి
- పార్టీ శ్రేణులు ప్రజల్లోకి వెళ్లాలని పిలుపు

**పరిగి నియోజకవర్గ బీఆర్ఎస్ సమావేశంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. అసైన్డ్ భూములకు పట్టాలు ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇప్పుడు అదే భూములను స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. దళితులు, గిరిజనులు, పేద రైతుల భూములను పారిశ్రామికవాడల పేరుతో తీసుకుంటున్నారని విమర్శించారు.**

**పరిగి, జూన్ 26 (నవజ్యోతి ప్రతినిధి):**

పరిగి నియోజకవర్గంలో కూడా పారిశ్రామికవాడల పేరిట పేదల భూములను బలవంతంగా స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని కేటీఆర్ ఆరోపించారు. ప్రజల అంగీకారం లేకుండా భూములు తీసుకోవడం సరికాదని, ప్రభుత్వం నిజంగా చిత్తశుద్ధితో వ్యవహరిస్తే ముందుగా పట్టాలు ఇచ్చి, చట్టబద్ధమైన నష్టపరిహారం చెల్లించిన తర్వాతే భూసేకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

మిగతా 2 లో..

# పారిశ్రామికాభివృద్ధే ప్రజల సంక్షేమానికి పునాది



## భట్టి విక్రమార్క

- ఇండస్ట్రియల్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ ఎక్స్‌పో - 2026 ప్రారంభం
- ఎంఎస్ఎంఈలు, మహిళా పారిశ్రామికవేత్తలకు మరింత ప్రోత్సాహం
- పరిశ్రమలకు అనుకూల వాతావరణం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

**హైదరాబాద్, జూన్ 26 (నవజ్యోతి ప్రతినిధి):**

హైదరాబాద్‌లో నిర్వహించిన ఇండస్ట్రియల్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ ఎక్స్‌పో–2026ను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పారిశ్రామిక ప్రదర్శనను పరిశీలించి పలు సంస్థల ప్రతినిధులతో మాట్లాడారు. తెలంగాణను దేశంలోనే అత్యుత్తమ పారిశ్రామిక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ పారిశ్రామికాభివృద్ధి అంటే కేవలం పెట్టుబడుల గణాంకాలు మాత్రమే కాదని, అది ప్రజలకు ఉపాధి

మిగతా 2 లో..

## హమాలీ ఆవిర్భావ సభకు కేటీఆర్‌కు ఆహ్వానం

- జులై 6 సభకు ముఖ్య అతిథిగా రావాలని ఆహ్వానించిన బండారి లక్ష్మారెడ్డి
- హమాలీ కార్మికుల సమస్యలపై కేటీఆర్‌కు వివరాలు

2



## తాడిపత్రిలో మళ్లీ రాజకీయ ఉద్రిక్తత



2

## నీట్ రీ పరీక్ష ఆన్సర్ కీ విడుదల

- జూన్ 28 వరకు అభ్యంతరాలు స్వీకరణ
- ప్రశ్నకు రూ.200 చెల్లించి సవాళ్లు నమోదు చేసే అవకాశం

2






# డ్రగ్స్ పై సమాజమంతా ఏకమవ్వాలి: భట్టి విక్రమార్క

**మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ కార్యక్రమంలో సినీ ప్రముఖుల సందేశం**

- శిల్పకళావేదికలో ఈగల్ ఫోర్స్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం
- యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపు

**హైదరాబాద్, జూన్ 26 (నవజ్యోతి ప్రతినిధి):**

అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో ఈగల్ ఫోర్స్, వికలాంగులు, సీనియర్ సిటిజన్లు, ట్రాన్స్ జెండర్ వ్యక్తుల సాధికారత శాఖ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. డ్రగ్స్ రహిత తెలంగాణ లక్ష్యంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రభుత్వంతో

మిగతా 2 లో..

## ఆధార్ తోనే ధృవపత్రాల డిజిటల్ ధృవీకరణకు ఆదేశం

**'డిజి వెరిఫై' వ్యవస్థను త్వరగా అందుబాటులోకి తేవాలని లోకేశ్ సూచన**



- ఉద్యోగ నియామకాల్లో పారదర్శకతకు సాంకేతికత వినియోగం
- డేటా లేక్, వాట్సాప్ పాలనపై ఉన్నతస్థాయి సమీక్ష

2






2

## డాలర్ ఆధిపత్యానికి సవాల్..

# వెనెజువెలాకు భారత్ మానవతా చేయూత

**'ఆపరేషన్ అమిస్తాద్'తో అత్యవసర సహాయక చర్యలు**

- వైద్య బృందం, భీష్మ క్యూబ్ లు, మందుల తరలింపు
- భూకంప బాధితులకు అండగా నిలిచిన భారత్

2



## జైలు నుంచి విడుదలైన బాల్క సుమన్

- బెయిల్ అనంతరం కేటీఆర్ తో భేటీ
- ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగుతుందని వ్యాఖ్య
- రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైన భేటీ

బెయిల్ పై విడుదలైన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ శుక్రవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు.

2



# హమాలీ ఆవిర్భావ సభకు కేటీఆర్‌కు ఆహ్వానం

**హైదరాబాద్, జూన్ 26 (నవజ్యోతి ప్రతినిధి):**

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శుక్రవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. జూలై 6న మల్లాపూర్‌లోని వీఎన్ఆర్ గార్డెన్‌లో నిర్వహించనున్న హమాలీ ఆవిర్భావ సభకు ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయనను ఆహ్వానించారు. ఈ సందర్భంగా హమాలీ కార్మికుల సంక్షేమానికి సంబంధించిన అంశాలు, వారు ఎదుర్కొంటున్న సమస్యలు, హమాలీ సంఘం చేపడుతున్న కార్యక్రమాలపై కేటీఆర్‌కు బండారి లక్ష్మారెడ్డి వివరించారు. కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం మరింత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరాన్ని కూడా ప్రస్తావించినట్లు సమాచారం. హమాలీ కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమ కార్యక్రమాల విస్తరణపై కూడా సమావేశంలో చర్చ జరిగినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. జూలై 6న జరిగే ఆవిర్భావ సభకు రాష్ట్ర నలుమూలల నుంచి హమాలీ కార్మికులు, సంఘం ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరు కానున్నట్లు వెల్లడించారు. ఈ భేటీలో మాజీ ఎమ్మెల్యే దేవేందర్ రెడ్డితో పాటు హమాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హమాలీ శ్రీనివాస్, ఇతర నాయకులు పాల్గొన్నారు. సభ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై కూడా ఈ సందర్భంగా చర్చించినట్లు సమాచారం. అనంతరం హబ్సిగూడ డివిజన్ బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ బీవీ చారి జన్మదినం సందర్భంగా కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు.

# పారిశ్రామికాభివృద్ధే ప్రజల సంక్షేమానికి పునాది

**మొదటిపేజీ తరువాయి**

కల్పించే శక్తిగా ప్రభుత్వం భావిస్తోందన్నారు. పరిశ్రమల విస్తరణతో యువతకు ఉద్యోగాలు, గ్రామీణ ప్రాంతాలకు ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, మహిళా పారిశ్రామికవేత్తలు, గ్రామీణ పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తోందన్నారు. ప్రతి శుక్రవారం పారిశ్రామిక రంగ ప్రతినిధులతో సమావేశమై వారి సమస్యలు తెలుసుకుని పరిష్కార చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. రాష్ట్రంలో పరిశ్రమలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. పరిశ్రమల అభివృద్ధికి అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తూ పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణం సృష్టిస్తున్నామని పేర్కొన్నారు. ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు, రీజనల్ రింగ్ రోడ్ వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు తెలంగాణ పారిశ్రామిక ప్రగతికి మరింత ఊతమిస్తాయని భట్టి విక్రమార్క అన్నారు. ఈ ప్రాజెక్టుల ద్వారా పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామికవేత్తలు, వివిధ పరిశ్రమల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. సాంకేతిక ఆవిష్కరణలు, నూతన పరిశ్రమలు, పెట్టుబడుల ఆకర్షణలో తెలంగాణ ముందంజలో నిలిచేలా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు.

# నీట్ రీ పరీక్ష ఆన్సర్ కీ విడుదల

**న్యూఢిల్లీ, జూన్ 26 (నవజ్యోతి ప్రతినిధి):**

నీట్ యూజీ–2026 రీ పరీక్షకు సంబంధించిన ప్రొవిజినల్ ఆన్సర్ కీని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ గురువారం విడుదల చేసింది. జూన్ 21న నిర్వహించిన రీ పరీక్షకు హాజరైన అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్‌లో తమ అప్లికేషన్ నంబర్, పాస్‌వర్డ్‌తో లాగిన్ అయి ఆన్సర్ కీని డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఎన్‌టీఏ వెల్లడించింది. పరీక్షలో ఇచ్చిన సమాధానాలపై అభ్యర్థులకు ఏవైనా అభ్యంతరాలు ఉంటే వాటిని నమోదు చేసుకునే అవకాశాన్ని కూడా కల్పించింది. ప్రొవిజినల్ ఆన్సర్ కీపై అభ్యంతరాలను ఈ నెల 28వ తేదీ రాత్రి 11.50 గంటల వరకు ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చని ఎన్‌టీఏ తెలిపింది. ప్రతి ప్రశ్నపై అభ్యంతరం నమోదు చేయడానికి రూ.200 చొప్పున ఆన్‌లైన్‌లో చెల్లించాల్సి ఉంటుంది. అభ్యంతరాలను సమర్థించే పత్రాలను కూడా తప్పనిసరిగా జత చేయాలని సూచించింది. అభ్యర్థులు తమ అభ్యంతరాలను ఒక్కసారి మాత్రమే సమర్పించాల్సి ఉంటుందని, ఒకసారి దరఖాస్తు పంపించిన తర్వాత మార్పులు చేసే అవకాశం ఉండదని ఎన్‌టీఏ స్పష్టం చేసింది. అందువల్ల సమర్పించే ముందు అన్ని వివరాలను జాగ్రత్తగా పరిశీలించుకోవాలని సూచించింది. అనంతరం నిపుణుల కమిటీ అన్ని అభ్యంతరాలను పరిశీలించి తుది నిర్ణయం తీసుకోనుంది.

# వెనెజువెలాకు భారత్ మానవతా చేయూత

**న్యూఢిల్లీ, జూన్ 26 (నవజ్యోతి ప్రతినిధి):**

వరుస భూకంపాలతో తీవ్రంగా నష్టపోయిన వెనెజువెలాకు భారత్ అత్యవసర సహాయాన్ని అందించేందుకు 'ఆపరేషన్ అమిస్తాద్' పేరుతో ప్రత్యేక సహాయక చర్యలను ప్రారంభించింది. స్పానిష్ భాషలో 'అమిస్తాద్' అంటే స్నేహం అని అర్థం. భారత వైమానిక దళానికి చెందిన రెండు సీ–17 గ్లోబ్‌మాస్టర్ విమానాల ద్వారా వైద్య బృందం, అత్యవసర వైద్య సామగ్రి, భీష్మ క్యూబ్‌లు, ఇతర సహాయక పరికరాలను వెనెజువెలాకు పంపించింది. ఈ విషయాన్ని విదేశాంగ శాఖ వెల్లడించింది. వెనెజువెలా ప్రజలు క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న ఈ సమయంలో భారత్ వారికి పూర్తి మద్దతుగా నిలుస్తుందని తెలిపింది. సహాయక బృందంలో 60 పారా ఫీల్డ్ హాస్పిటల్‌కు చెందిన 41 మంది సిబ్బంది ఉన్నారు. వీరిలో తొమ్మిది మంది వైద్యులు ఉండగా, అత్యవసర వైద్యం, శస్త్రచికిత్సలు, ఇతర ఆరోగ్య సేవలు అందించేందుకు ప్రత్యేకంగా సిద్ధమయ్యారు. సహాయక బృందంతో పాటు సుమారు ఆరు టన్నుల వైద్య సామగ్రిని కూడా పంపించారు. ఇందులో అత్యవసర మందులు, చికిత్స పరికరాలు, ప్రాణరక్షక ఔషధాలు, వైద్య వినియోగ సామగ్రి ఉన్నాయి.

# డాలర్ ఆధిపత్యానికి సవాల్..

**హైదరాబాద్ , జూన్ 26 (నవజ్యోతి ప్రతినిధి):**

అమెరికా ఆంక్షల సడలింపు, ఇరాన్ ఆస్తుల విడుదల, చమురు ఎగుమతుల పునరుద్ధరణపై చర్చలు కొనసాగుతున్న వేళ ఇరాన్ సెంట్రల్ బ్యాంక్ గవర్నర్ అబ్దుల్నాసర్ హెమ్మతి చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయ ఇంధన మార్కెట్లలో చర్చనీయాంశంగా మారాయి.డాలర్ ఆధారిత చమురు లావాదేవీలకు ఇకపై పూర్తిగా కట్టుబడి ఉండబోమని, తమకు అనుకూలమైన ఏ కరెన్సీలోనైనా చెల్లింపులను స్వీకరించే స్వేచ్ఛ ఇరాన్‌కు ఉందని ఆయన స్పష్టం చేశారు. వాణిజ్య ఒప్పందాలు, ఆర్థిక ప్రయోజనాల ఆధారంగా ప్రత్యామ్నాయ కరెన్సీలను ఉపయోగించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన వ్యాఖ్యానించారు. సుమారు 12 బిలియన్ డాలర్ల విలువైన ఇరాన్ ఆస్తుల విడుదల, ఆంక్షల సడలింపు అంశాలపై అమెరికా–ఇరాన్ మధ్య చర్చలు జరుగుతున్న సమయంలో ఈ వ్యాఖ్యలు మరింత ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఇదే నేపథ్యంలో భారతదేశానికి కూడా ఈ పరిణామం ప్రయోజనం చేకూర్చే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. గతంలో తక్కువ రవాణా దూరం కారణంగా ఇరాన్ చమురు భారత్‌కు ఖర్చు పరంగా అనుకూలంగా ఉండేది. అలాగే ఇతర సరఫరాదారులతో పోలిస్తే 60 నుంచి 90 రోజుల వరకు ఎక్కువ క్రెడిట్ సౌకర్యం ఇరాన్ అందించేదని గుర్తు చేస్తున్నారు. ప్రస్తుతం ప్రపంచ చమురు మార్కెట్‌లో నెలకొన్న అనిశ్చితి మధ్య ఈ తాజా సంకేతాలు డాలర్ ఆధిపత్యంపై మరోసారి చర్చను ప్రారంభించాయి.

# అసైన్డ్ భూముల విషయంలో పేదలకు అండగా ఉంటాం

**మొదటిపేజీ తరువాయి**

లగచర్ల ఘటనను ప్రస్తావిస్తూ భూములు ఇవ్వలేదనే కారణంతో రైతులపై కేసులు నమోదు చేసి వేధింపులకు గురిచేశారని ఆరోపించారు. గిరిజనులపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపించడం దురదృష్టకరమని, ఇలాంటి చర్యలను బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని అన్నారు. అసైన్డ్ భూముల విషయంలో పేదలకు పార్టీ అండగా నిలుస్తుందని, అవసరమైతే న్యాయపోరాటం కూడా చేస్తామని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని కేటీఆర్ విమర్శించారు. రైతులకు రైతుబంధు, పంట బోనస్, కౌలు రైతులు, రైతు కూలీలకు ఆర్థిక భరోసా, మహిళలకు నెలకు రూ.2,500 వంటి హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ఇచ్చిన హామీలు కూడా అమలు కాలేదని అన్నారు. పరిగి ప్రాంతానికి నీటి ప్రాజెక్టుల విషయంలో కూడా ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. గతంలో రూపొందించిన ప్రణాళికలను పక్కనపెట్టి కొత్త పథకాల పేరుతో ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారని విమర్శించారు. మహిళలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, లేకపోతే ప్రజలకు సమాధానం చెప్పాల్సి వస్తుందని అన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదు చేస్తే పార్టీ అండగా ఉంటుందని, చట్టపరంగా పోరాడుతామని హెచ్చరించారు. అలాగే భవిష్యత్తులో కార్యకర్తలకు తగిన గౌరవం, అవకాశాలు కల్పించే బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు.

# ఈ నెల 28న పల్స్ పోలియో కార్యక్రమం

**హైదరాబాద్, జూన్ 26 (నవజ్యోతి ప్రతినిధి):**

రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 28 నుంచి నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ శుక్రవారం ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని 0 నుంచి 5 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు అందేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జూబ్లీహిల్స్‌లోని రాజీవ్ ఆరోగ్యశ్రీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో జూన్ 28న పోలియో బూత్‌ల ద్వారా, జూన్ 29, 30 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి మిగిలిపోయిన చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లో పట్టణ ప్రాంతాలు అధికంగా ఉండటంతో జూలై 1న అదనంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించాలని మంత్రి సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 22,979 పోలియో బూత్‌లు, 903 మొబైల్ బృందాలు, 903 ట్రాన్సిట్ పాయింట్లు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. సుమారు 40.97 లక్షల మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడానికి 52.04 లక్షల బీవోపీవీ టీకా డోసులు జిల్లాలకు సరఫరా చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొననున్నారు. వలస కార్మికుల పిల్లలు, ఇటుక బట్టీలు, నిర్మాణ ప్రాంతాలు, పట్టణ బస్తీలు, కొత్త కాలనీలు, గిరిజన ప్రాంతాల్లోని చిన్నారులకు ప్రత్యేకంగా పోలియో చుక్కలు అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. మహిళా శిశు సంక్షేమం, మున్సిపల్, పంచాయతీరాజ్, విద్యాశాఖ, ఆర్టీసీ తదితర శాఖలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. తెలంగాణలో చివరి పోలియో కేసు 2007లో నమోదైందని అధికారులు గుర్తు చేశారు. పోలియో రహిత హోదాను కొనసాగించేందుకు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయడం అత్యంత కీలకమని మంత్రి పేర్కొన్నారు. గతంలో పోలియో చుక్కలు వేసినా మరోసారి వేయించడం వల్ల పూర్తి రక్షణ లభిస్తుందని వివరించారు.

# తెలంగాణ కొత్త సీఎస్‌గా సంజయ్ జాజు

**హైదరాబాద్, జూన్ 26 (నవజ్యోతి ప్రతినిధి):**

తెలంగాణ రాష్ట్ర కొత్త ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారి సంజయ్ జాజును రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు శుక్రవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వంలో విధులు నిర్వహిస్తున్న ఆయనను రాష్ట్ర పరిపాలనలో అత్యున్నత అధికారిగా నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 1992 బ్యాచ్‌కు చెందిన సంజయ్ జాజు కేంద్ర ప్రభుత్వంలోని ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి మంత్రిత్వ శాఖ కార్యదర్శిగా పనిచేశారు. తెలంగాణ ప్రభుత్వం చేసిన విజ్ఞప్తి మేరకు కేంద్ర సిబ్బంది, శిక్షణా వ్యవహారాల శాఖ ఇటీవల ఆయనను పేరెంట్ కేడర్‌కు బదిలీ చేసింది. మూడు రోజుల క్రితమే ఆయన కేంద్ర సర్వీసుల నుంచి రిలీవ్ అయ్యారు. ప్రస్తుతం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఉన్న కే. రామకృష్ణారావు పదవీకాలం ఈ నెల 30తో ముగియనుంది. దీంతో తదుపరి సీఎస్‌గా సంజయ్ జాజును నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పరిపాలనలో సుదీర్ఘ అనుభవం ఉన్న అధికారిగా ఆయనకు గుర్తింపు ఉంది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం జులై 1 నుంచి సంజయ్ జాజు అధికారికంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టనున్నారు. రాష్ట్ర పరిపాలనా వ్యవస్థలో కీలకమైన ఈ పదవిలో ఆయన ప్రభుత్వ విధానాల అమలు, వివిధ శాఖల సమన్వయం, అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణ వంటి బాధ్యతలు నిర్వర్తించనున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో పలు కీలక హోదాల్లో పనిచేసిన అనుభవం సంజయ్ జాజుకు ఉంది. ముఖ్యంగా పరిపాలన, విధానాల రూపకల్పన, అభివృద్ధి కార్యక్రమాల అమలులో ఆయనకు విశేష అనుభవం ఉండటంతో రాష్ట్ర పరిపాలనకు ఆయన సేవలు ఉపయోగపడతాయని అధికారులు భావిస్తున్నారు. కొత్త ప్రధాన కార్యదర్శి నియామకంతో రాష్ట్ర పరిపాలనలో కీలక మార్పు చోటుచేసుకోనుంది. జులై 1 నుంచి సంజయ్ జాజు బాధ్యతలు స్వీకరించగా, పదవీ విరమణ చేస్తున్న కే. రామకృష్ణారావుకు ప్రభుత్వం, అధికారులు అభినందనలు తెలియజేస్తూ ఆయన సేవలను కొనియాడుతున్నారు.

# డ్రగ్స్‌పై సమాజమంతా ఏకమవ్వాలి: భట్టి విక్రమార్క

**మొదటిపేజీ తరువాయి**

పాటు సమాజంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండి విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. డ్రగ్స్ వ్యసనం వ్యక్తి, కుటుంబం, సమాజాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, డీజీపీ సీవీ ఆనంద్, సందీప్ కుమార్ శాండిల్య, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అనితా రామచంద్రన్ పాల్గొని మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వివరించారు. డ్రగ్స్ అక్రమ రవాణా, వినియోగంపై కఠిన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. సినీ నటుడు రామ్ పోతినేని, సినీ నటి మీనాక్షి చౌదరి కూడా కార్యక్రమంలో పాల్గొని యువతకు సందేశం ఇచ్చారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, సమాజ అభివృద్ధికి ప్రతి యువకుడు తనవంతు బాధ్యత నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డ్రగ్స్ దుష్పరిణామాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు, ప్రదర్శనలు నిర్వహించారు. విద్యార్థులు, యువత, వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని డ్రగ్స్ నిర్మూలనకు తమ మద్దతు ప్రకటించారు. డ్రగ్స్ రహిత తెలంగాణ సాధనే లక్ష్యంగా ప్రభుత్వం అన్ని విభాగాల సమన్వయంతో పనిచేస్తోందని అధికారులు తెలిపారు. మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేసి సమాజ రక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

# తాడిపత్రిలో మళ్లీ రాజకీయ ఉద్రిక్తత

- **పోటాపోటీ నిరసనలకు పిలుపుతో ఉద్రిక్త పరిస్థితులు**
- **కేతిరెడ్డి పెద్దారెడ్డి గృహనిర్బంధం**

**అనంతపురం, జూన్ 26 (నవజ్యోతి ప్రతినిధి):**

అనంతపురం జిల్లా తాడిపత్రిలో మరోసారి రాజకీయ ఉద్రిక్తత నెలకొంది. టీడీపీ మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి వర్గాలు ఒకే రోజు వేర్వేరుగా నిరసన కార్యక్రమాలకు పిలుపునివ్వడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. కేతిరెడ్డి పెద్దారెడ్డి వర్గీయులు తాడిపత్రిలోని గాంధీ విగ్రహం వద్ద సామూహిక దీక్ష చేపడతామని ప్రకటించారు. అయితే ఈ దీక్షను అడ్డుకుంటామని టీడీపీ నేతలు ప్రకటించడంతో ఇరువర్గాల మధ్య ఉద్రిక్తత మరింత పెరిగింది. అదే సమయంలో టీడీపీ వర్గం అనంతపురంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యేల ఇళ్ల ముందు నల్ల బ్యాడ్జీలతో నిరసనలు చేపడతామని ప్రకటించింది. జిల్లాలో మొహరం వేడుకలు, వీవీఐపీల పర్యటనలు ఒకేసారి ఉండటంతో భద్రతా ఏర్పాట్లపై ఒత్తిడి నెలకొన్న నేపథ్యంలో ఇరువర్గాల కార్యక్రమాలకు అనుమతి ఇవ్వలేమని పోలీసులు స్పష్టం చేశారు. ప్రజా శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకుని ఇరు పక్షాల నిరసనలకు అనుమతి నిరాకరించారు. ఇరు వర్గాల నాయకులకు ముందస్తుగా చట్టపరమైన నోటీసులు జారీ చేసిన పోలీసులు శాంతిభద్రతలకు సహకరించాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో కేతిరెడ్డి పెద్దారెడ్డిని పోలీసులు ఆయన నివాసంలోనే గృహనిర్బంధం చేశారు. ఆయన ఇంటి వద్ద భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు తాడిపత్రిలోని గాంధీ సర్కిల్, ఇతర సున్నిత ప్రాంతాల్లో కూడా అదనపు పోలీసు బలగాలను మోహరించారు. తాడిపత్రిలో పరిస్థితిని పోలీసులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రజలు ప్రశాంత వాతావరణానికి సహకరించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# జైలు నుంచి విడుదలైన బాల్క సుమన్

**హైదరాబాద్, జూన్ 26 (నవజ్యోతి ప్రతినిధి):**

జైలు నుంచి విడుదలైన అనంతరం జరిగిన ఈ భేటీ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ సందర్భంగా ఇద్దరూ ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, ప్రజా సమస్యలపై చర్చించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఇటీవల నమోదైన కేసులో అరెస్టై 27 రోజుల పాటు జైలులో ఉన్న బాల్క సుమన్‌కు న్యాయస్థానం బెయిల్ మంజూరు చేయడంతో ఆయన విడుదలయ్యారు. విడుదల అనంతరం పార్టీ ముఖ్య నేతలను కలుస్తూ ముందుకు సాగుతున్నారు. ఇందులో భాగంగానే కేటీఆర్‌ను కలిసి తాజా పరిణామాలపై చర్చించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ, సింగరేణిలో జరుగుతున్న అంశాలు, ప్రజా సమస్యలను ప్రశ్నించినందుకే బాల్క సుమన్‌పై కేసులు నమోదు చేశారని ఆరోపించారు. రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే ఆయనను జైలుకు పంపించారని పార్టీ నేతలు విమర్శించారు. అయితే ఈ కేసులన్నీ న్యాయస్థానంలో తేలుతాయని, ప్రజా సమస్యలపై తమ పోరాటం కొనసాగుతుందని బాల్క సుమన్ పేర్కొన్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ప్రజా ప్రయోజనాల కోసం వెనుకడుగు వేయబోమని ఆయన స్పష్టం చేసినట్లు తెలిపాయి. కేటీఆర్ కూడా బాల్క సుమన్‌ను పరామర్శించి ధైర్యం చెప్పారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు న్యాయబద్ధమైన పోరాటాన్ని కొనసాగించాలని సూచించినట్లు సమాచారం. బీఆర్ఎస్ నాయకులు పలువురు ఈ భేటీలో పాల్గొన్నారు. బాల్క సుమన్ విడుదల అనంతరం జరిగిన ఈ భేటీ రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది. దీనిపై అధికార, ప్రతిపక్షాల మధ్య రాజకీయ విమర్శలు కొనసాగుతున్నాయి. కేసు విచారణ న్యాయస్థానంలో కొనసాగుతున్న నేపథ్యంలో తదుపరి పరిణామాలపై రాజకీయ వర్గాలు దృష్టి సారించాయి.

# ఆధార్ తోనే ధృవపత్రాల డిజిటల్ ధృవీకరణకు ఆదేశం

**మొదటిపేజీ తరువాయి**

అందుబాటులోకి వచ్చేలా 'డిజి వెరిఫై' వ్యవస్థను రూపొందించాలని సూచించారు. శుక్రవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో మంత్రి లోకేశ్ ఈ ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సమాచారాన్ని ఒకే వేదికపై సమీకరించే 'డేటా లేక్' పనులను జులై నెలలోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో చదువు మానేసిన విద్యార్థుల వివరాలను డేటా ఆధారంగా విశ్లేషించి వారిని తిరిగి విద్యాబాట పట్టించే చర్యలు చేపట్టాలని సూచ'మనమిత్ర'ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత సులభంగా అందించేందుకు 'మనమిత్ర' వాట్సాప్ సేవలపై నెలరోజుల పాటు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని మంత్రి సూచించారు. కుల, ఆదాయ ధృవీకరణ పత్రాల జారీ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు రేషన్ కార్డుల విభజన, పేర్ల చేర్పులు, తొలగింపులను సరళీకృతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని జలవనరులు, వ్యవసాయం, ఇతర శాఖలు సమన్వయంతో పనిచేయాలని లోకేశ్ పేర్కొన్నారు. నీటి వృథాను అరికట్టి తక్కువ నీటితో అధిక దిగుబడి సాధించే పంటలను ప్రోత్సహించాలని సూచించారు. జలాశయాల్లో నీటి లభ్యత, భూగర్భ జలాల స్థాయిని నిరంతరం పర్యవేక్షిస్తూ ముఖ్యంగా రాయలసీమలో నీటి కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గే అవకాశాలు ఉన్నందున విద్యుత్ సరఫరాపై ముందస్తు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని మంత్రి సూచించారు. విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా సరఫరాలో అంతరాయాలు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో సీసీఎల్ఏ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి , ఆర్టీజీఎస్ సీఈవో ప్రఖర్ జైన్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# భక్తి శ్రద్ధలతో ఇమామ్ హుస్సేన్ షహదత్..

- ముమ్మిడివరంలో మొహరం 10వ రోజు సంతాప కార్యక్రమాలు..

**ముమ్మిడివరం, జూన్ 26 (నవజ్యోతి ప్రతినిధి రెడ్డి వీరబాబు) :**



మహమ్మద్ ప్రవక్త మనవడు హజరత్ ఇమామ్ హుస్సేన్ కర్బలా (ప్రస్తుత ఇరాక్)లో తన 72 మంది కుటుంబ సభ్యులతో కలిసి ప్రాణాలను బలిదానం చేసి ఇస్లాం ధర్మాన్ని పరిరక్షించిన త్యాగాన్ని స్మరించుకుంటూ, మొహరం సంతాప దినాల్లో భాగంగా 10వ రోజు షహదత్ కార్యక్రమాలను ముమ్మిడివరంలోని షియా ముస్లింలు శుక్రవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.ఉదయం నుంచి మజిలీస్ కార్యక్రమాలు నిర్వహించిన భక్తులు రక్తాలు చిందేలా మాతం చేస్తూ, గుండెలు బాదుకుంటూ ఇమామ్ హుస్సేన్ కుటుంబ సభ్యులకు అశ్రునయనాలతో శ్రద్ధాంజలి ఘటించారు.స్థానిక పీర్ల పంజాలు అయిన బిబి జైనబియా, ఆస్థానే అబుల్ ఫజిల్ అబ్బాస్, మంజీలే షోహదా, బైతుల్ ఖాయం, అలీ అసగర్ పంజాల వద్ద షియా మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో చేరుకొని మజిలీస్‌లను ఆలపిస్తూ ఇమామ్ హుస్సేన్ కుటుంబ సభ్యుల త్యాగాలను స్మరించుకుని కన్నీటిపర్యంతమయ్యారు.ఈ సందర్భంగా హైదరాబాద్ నుంచి విచ్చేసిన మౌలానా మీర్ మహమ్మద్ అలీ జాఫరీ కర్బలాలో జరిగిన యదార్థ ఘటనలను భక్తులకు వివరించి, ఇమామ్ హుస్సేన్ త్యాగం సత్యం, న్యాయం, ధర్మ పరిరక్షణకు ప్రతీకగా నిలిచిందని పేర్కొన్నారు. కార్యక్రమానికి సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులకు కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తి, విషాద వాతావరణంలో కార్యక్రమాలు ముగిశాయి.

# జీఎంసీ బాలయోగి వారధిపై నుంచి గోదావరిలో దూకిన వివాహిత..

## మునిగి మృతి

**ముమ్మిడివరం, జూన్ 26 (నవజ్యోతి ప్రతినిధి – రెడ్డి వీరబాబు) :**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఐ. పోలవరం మండలం ఎదుర్లంక జీఎంసీ బాలయోగి వారధిపై నుంచి గోదావరిలో దూకి కొమరగిరి లైన్‌పేటకు చెందిన కలవల దుర్గా భవాని (33) అనే వివాహిత శుక్రవారం ఆత్మహత్య చేసుకుంది.వారధిపై నుంచి గోదావరిలో దూకడాన్ని గమనించిన స్థానిక మత్స్యకారులు వెంటనే ఆమెను రక్షించేందుకు ప్రయత్నించినప్పటికీ, అప్పటికే ఆమె గోదావరిలో మునిగిపోవడంతో ప్రాణాలు కోల్పోయింది.సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.మృతురాలు గత కొంతకాలంగా మానసిక ఆరోగ్య సమస్యతో బాధపడుతూ కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు ఆమె భర్త, ఆటో డ్రైవర్ విజయకుమార్ పోలీసులకు తెలిపాడు. శుక్రవారం ఆసుపత్రికి వెళ్తున్నానని ఇంటి నుంచి బయలుదేరిన భవాని, అనంతరం వారధి వద్దకు చేరుకుని గోదావరిలో దూకినట్లు పేర్కొన్నాడు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.



ఈ ఘటనతో కుటుంబ సభ్యులు, బంధువులు విషాదంలో మునిగిపోయారు. పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# దక్షిణాసియా రాక్‌బాల్ టోర్నమెంట్‌కు ఎంపికైన పూడూరు యువకుడు గోపాల్ యాదవ్

**మేడ్చల్, జూన్26 (నవజ్యోతి ప్రతినిధి) :**

నేపాల్ రాజధాని ఖాట్మండు వేదికగా జూన్ 27 నుండి ప్రారంభం కానున్న ప్రతిష్టాత్మక మొదటి దక్షిణాసియా రాక్‌బాల్ టోర్నమెంట్'లో పాల్గొనే భారత జాతీయ జట్టులో మన స్థానిక పూడూరు గ్రామానికి చెందిన యువ క్రీడాకారుడు గోపాల్ యాదవ్ చోటు దక్కించుకున్నారు.ఇటీవల దేశవ్యాప్తంగా నిర్వహించిన రాక్‌బాల్ క్రీడా ప్రదర్శనలు మరియు ట్రయల్స్‌లో గోపాల్ యాదవ్ అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. ఈ ప్రదర్శనలను క్షుణ్ణంగా పరిశీలించిన జాతీయ సెలెక్టర్లు, ఆయన్ను భారత జట్టుకు ఎంపిక చేశారు. కఠినమైన పోటీని తట్టుకుని జాతీయ జట్టులో స్థానం సంపాదించడం పట్ల క్రీడా వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.అంతర్జాతీయ స్థాయిలో దేశానికి ప్రాతినిధ్యం వహించే అవకాశం




లభించడం తన జీవితంలో గొప్ప మలుపు అని గోపాల్ యాదవ్ పేర్కొన్నారు. "ఈ టోర్నమెంట్‌లో భారతదేశం తరఫున అత్యుత్తమ ప్రదర్శన కనబర్చి, మన దేశానికి పతకం అందించడమే నా లక్ష్యం. క్రీడాకారుడిగా అంతర్జాతీయ వేదికపై మన జెండాను ఎగురవేస్తాను" అని ఆయన తన ఉత్సాహాన్ని పంచుకున్నారు.

**వెల్లువెత్తుతున్న అభినందనలు:**

గోపాల్ యాదవ్ సాధించిన ఈ ఘనతపై పూడూరు గ్రామ ప్రజలు, క్రీడాభిమానులు మరియు స్థానిక ప్రముఖులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ఆయనకు అభినందనలు తెలుపుతూ, టోర్నమెంట్‌లో భారత జట్టు విజయం సాధించాలని మరియు గోపాల్ యాదవ్ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

# గంజాయి ముఠా అరెస్ట్.. 5.8 కిలోల స్వాధీనం

**మేడ్చల్, జూన్ 26(నవజ్యోతి ప్రతినిధి) :**

మేడ్చల్ పరిధిలో అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు మేడ్చల్ పోలీస్ స్టేషన్ అధికారులు వివరాలను వెల్లడించారు ఖచ్చితమైన సమాచారం అందుకున్న మేడ్చల్ పోలీసులు, జూన్ 25న మేడ్చల్‌లోని ఓఆర్ఆర్ ఎగ్జిట్ నంబర్ 06, ధృవ కాలేజ్ రోడ్డు సమీపంలో తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా కనిపిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని సోదా చేయగా, వారి వద్ద ఉన్న నలుపు రంగు సంచిలో 5.849 కిలోల గంజాయి బయటపడింది. నిందితుల వద్ద నుంచి ఒక మొబైల్ ఫోన్‌ను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ అయిన వారిద్దరూ మహారాష్ట్రలోని జల్నా జిల్లాకు చెందిన కూలీలుగా గుర్తించారు..సచిన్ సంతోష్ జాదవ్ (అలియాస్ నితిన్/ఆకాష్ – 24 ఏళ్లు) రాజేష్ మాధవ్ చౌదరి (22 ఏళ్లు) ప్రాథమిక విచారణలో, నిందితులు ఒడిశా నుంచి ఈ గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి, అక్రమంగా మేడ్చల్‌కు తరలించి ఇక్కడ అధిక ధరకు విక్రయించేందుకు ప్లాన్ చేసినట్లు తేలింది. ఈ ఘటనపై మేడ్చల్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 635/2026, సెక్షన్ 20(బి )(ఐఐ)(బి ) ర్ / డబ్ల్యూ 8(సి ) ఎన్ డి పి ఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు. ఈ గంజాయి సరఫరా వెనుక ఉన్న అసలు సూత్రధారులు మరియు ఇతర వ్యక్తుల కోసం పోలీసులు



లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

# పారదర్శకంగా ఓటరు జాబితా సవరణ చేపట్టాలి

- పింకేష్ కుమార్
- ఓటరు జాబితా సవరణపై జోనల్ కమిషనర్ ఫీల్డ్ విజిట్
- అర్హులందరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం

**కుత్బుల్లాపూర్, జూన్ 26 (నవజ్యోతి ప్రతినిధి) :**

ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రాణాధారమైన ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, తప్పులేని విధంగా



నిర్వహించాలని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్(ఐఏఎస్) అధికారులకు సూచించారు. జీడిమెట్ల సర్కిల్‌లో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ( సార్) కార్యక్రమాన్ని గురువారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా బిఎల్ఓ సూపర్వైజర్లు, బూత్ లెవెల్ ఆఫీసర్లు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే, ఓటర్ల వివరాల ధృవీకరణ, కొత్త ఓటర్ల నమోదు తదితర ప్రక్రియలను సమీక్షించారు.అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా జాగ్రత్తలు తీసుకోవాలని, ఎటువంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో జీడిమెట్ల సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డి. శంకర్ సింగ్, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, బిఎల్ఓ సూపర్వైజర్ జవాహర్‌లాల్‌తో పాటు బూత్ లెవెల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

# కాట్రియాల్ గ్రామంలో ఎస్ఐఆర్ కార్యక్రమానికి శ్రీకారం.

- ఇంటింటా ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభం.

**రామాయంపేట, జూన్ 26 (నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్) :**

రామాయంపేట మండలం కాట్రియాల్ గ్రామంలో భారత ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ కొత్త స్రవంతి రాజేందర్ గుప్తా ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా సవరణలో భాగంగా ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ (Enumeration) ఫారాలు పంపిణీ చేసి వివరాల నమోదు ప్రక్రియను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో బీఎల్‌వోలు, బిల్ఏలు పాల్గొని ఓటరు జాబితాను ఖచ్చితంగా రూపొందించేందుకు తమ సహకారాన్ని అందించాలని అర్హులైన ప్రతి ఒక్కరూ తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకుని ఓటరు హక్కును వినియోగించుకోవాలని అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజాప్రతినిధులు సూచించారు.



# 51 మంది లబ్ధిదారులకు రూ.14.43 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



**బాన్సువాడ, జూన్ 26 (నవజ్యోతి ప్రతినిధి):**

బాన్సువాడ పట్టణ కేంద్రంలోని తన నివాసంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి 51 మంది ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) లబ్ధిదారులకు రూ.14,43,000 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు పాల్గొన్నారు.నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన లబ్ధిదారులకు ఈ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. బాన్సువాడ గ్రామీణ మండలానికి చెందిన 6 మందికి రూ.1.86 లక్షలు, బాన్సువాడ మున్సిపాలిటీకి చెందిన ఇద్దరికి రూ.35,500, బీర్కూర్ మండలానికి చెందిన నలుగురికి రూ.75,500, నసురుల్లాబాద్ మండలానికి చెందిన 8 మందికి రూ.1.59 లక్షలు, మోస్రా మండలానికి చెందిన ఇద్దరికి రూ.28 వేలు, చందూర్ మండలానికి చెందిన నలుగురికి రూ.1.22 లక్షలు, వర్ని మండలానికి చెందిన ఐదుగురికి రూ.1.57 లక్షలు, రుద్రూర్ మండలానికి చెందిన నలుగురికి రూ.1.56 లక్షలు, కోటగిరి మండలానికి చెందిన ఆరుగురికి రూ.2.52 లక్షలు, పోతంగల్ మండలానికి చెందిన 9 మందికి రూ.2.54 లక్షలు, ఇతర ప్రాంతానికి చెందిన ఒకరికి రూ.17 వేలు మంజూరైనట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# షబ్బీర్ అలీని మర్యాదపూర్వకంగా కలిసిన రవాణా శాఖ అధికారులు



**కామారెడ్డి, జూన్ 26 (నవజ్యోతి ప్రతినిధి):**

కామారెడ్డి కాంగ్రెస్ నియోజకవర్గ కార్యాలయంలో తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్‌ను రవాణా శాఖ అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా రవాణా అధికారి (డీటీఓ) సంతోష్ కుమార్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) ప్రదీప్ కుమార్ గౌడ్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఏఎంవీఐ) మహ్మద్ రఫీ పాల్గొన్నారు.సమావేశంలో రవాణా శాఖకు సంబంధించిన పలు అంశాలు, ప్రజా సేవలు, రహదారి రవాణా పరిపాలన, ప్రజా సంక్షేమానికి సంబంధించిన విషయాలపై చర్చించారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించే దిశగా శాఖల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయాల్సిన అవసరంపై అభిప్రాయాలు పంచుకున్నారు. ఈ సమావేశం స్నేహపూర్వక వాతావరణంలో జరిగింది.

# గంగా భవాని ఆలయాన్ని సందర్శించిన సుభాష్ రెడ్డి



**కాచాపూర్ ,బిక్కనూరు జూన్ 26 (నవజ్యోతి ప్రతినిధి):**

బిక్కనూరు మండలం కాచాపూర్ గ్రామ గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ప్రతిష్ఠించిన గంగా భవాని ఆలయాన్ని ప్రముఖ మానవతావాది, విద్యాప్రదాత, వ్యాపారవేత్త తిమ్మయ్యగారి సుభాష్ రెడ్డి శుక్రవారం సందర్శించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా నిర్వహించిన గంగా భవాని అమ్మవారి కళ్యాణోత్సవంలో పాల్గొని గ్రామ ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎస్.ఆర్. ఫౌండేషన్ సభ్యులు, గంగపుత్ర సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు, మహిపాల్ మిత్రబృందం సభ్యులు పాల్గొన్నారు.

# కాట్రేనికోనలో విషాదం రోడ్డు ప్రమాదంలో టీడీపీ నాయకుడు లోవరాజు మృతి..

**కాట్రేనికోన, జూన్ 26 (నవజ్యోతి ప్రతినిధి రెడ్డి వీరబాబు) :**



డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు లోవరాజు గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.గెద్దనపల్లి సమీపంలోని ఆర్ & బి రహదారిపై రాత్రి సుమారు 11:30 గంటల సమయంలో లోవరాజు రోడ్డుపై అపస్మారక స్థితిలో పడి ఉండగా స్థానికులు గుర్తించారు. తలకు తీవ్ర గాయాలు కావడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం.అయితే ఈ ప్రమాదం ఎలా జరిగిందనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. మోటార్‌సైకిల్‌పై ప్రయాణిస్తుండగా అదుపు తప్పి కిందపడిపోయారా? లేక అకస్మాత్తుగా ఏదైనా జంతువు అడ్డురావడంతో ప్రమాదం జరిగిందా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ముమ్మిడివరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కాట్రేనికోన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మెదక్ జిల్లా బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా దంతేపల్లి సర్పంచ్ బాలరాజ్ నియామకం.




**రామాయంపేట జూన్ 26 ( నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్ ) :**

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ ఎన్. రామచందర్ రావు సూచనల మేరకు, బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షులు శ్రీ కాంతి కిరణ్ రాష్ట్రంలోని ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులను నియమించారు.ఈ క్రమంలో మెదక్ జిల్లా బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా దంతేపల్లి బాలరాజ్ (సర్పంచ్) నియమితులయ్యారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, నూతన బాధ్యతల్లో విజయవంతం కావాలని ఆకాంక్షించారు.ఎస్సీ మోర్చాను గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేస్తూ, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు కృషి చేయాలని నాయకులు సూచించారు. అలాగే పార్టీ అభివృద్ధి, సమాజ సేవ, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేయాలని కోరారు.దంతేపల్లి బాలరాజ్ నాయకత్వంలో మెదక్ జిల్లాలో ఎస్సీ మోర్చా మరింత బలోపేతం అవుతుందని, పార్టీ విస్తరణకు ఆయన కీలక పాత్ర పోషిస్తారని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నూతనంగా నియమితులైన ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులందరికీ పార్టీ నాయకులు, కార్యకర్తలు హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి అదృశ్యం

**కుషాయిగూడ, జూన్ 26, (నవజ్యోతి ప్రతినిధి) :**



కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో అనారోగ్యంతో పాటు మతిమరుపుతో బాధపడుతున్న ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సోనియా గాంధీ నగర్‌కు చెందిన పోతుల పెద్దకిష్టయ్య (59) ఈ నెల 25న తెల్లవారుజామున ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభించకపోవడంతో కుమారుడు పోతుల నరసింహ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు అదృశ్యమైన వ్యక్తి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.భూత్ స్థాయి బలోపేతానికి బీజేపీ సన్నాహక సమావేశం

## నా భూత్–అందరికంటే బలం లక్ష్యంతో కార్యకర్తలకు దిశానిర్దేశం

- **నితిన్ నబిన్ పర్యటన విజయవంతం చేయాలని బీజేపీ పిలుపు**
- **భూత్ స్థాయి బలోపేతమే లక్ష్యం:విఘ్నేశ్వర చారి**



**కుత్బుల్లాపూర్, జూన్ 26: (నవజ్యోతి ప్రతినిధి) :**

భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్ పర్యటన సందర్భంగా ఈ నెల 28న నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న భూత్ అధ్యక్షుల సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలని దుండిగల్ సర్కిల్ బీజేపీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి విఘ్నేశ్వర చారి మాట్లాడుతూ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడానికి ప్రతి భూత్‌లో కమిటీలు పూర్తి స్థాయిలో పనిచేయాలని సూచించారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు "నా భూత్ – అందరికంటే బలం" లక్ష్యంతో కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత రేషన్, ఆయుష్మాన్ భారత్, పీఎం కిసాన్, ఆవాస్ యోజన, ముద్రా లోన్లు వంటి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, లబ్ధిదారులతో మమేకమై పార్టీకి మద్దతు పెంచాలని సూచించారు.అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని ప్రజలకు వివరించాలని, స్థానిక సమస్యలపై ప్రజల పక్షాన పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ప్రతి భూత్ నుండి ముఖ్య నాయకులు, శక్తి కేంద్రాల ఇన్‌ఛార్జ్‌లు, కార్యకర్తలు వంద శాతం హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో బౌరంపేట్ డివిజన్ ప్రెసిడెంట్ పీసరి కృష్ణారెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు మల్లేష్ యాదవ్, జిల్లా గిరిజన మోర్చా అధ్యక్షులు వెంకటేష్ నాయక్, రాష్ట్ర గిరిజన మోర్చా నాయకులు శ్యామ్ రావు, శ్రీనివాస్ యాదవ్, సీతారాం రెడ్డి, ఆకుల విజయ్, ఎంబరి ఆంజనేయులు, రోజా తదితరులు పాల్గొన్నారు.

# అర్ధరాత్రి బైక్ చోరీ..సీసీ కెమెరాల్లో నలుగురు యువకుల కదలికలు

- **ఇంటి ముందు నిలిపిన పల్సర్ అపహరణ..**
- **కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన కీసర పోలీసులు**




**కీసర, జూన్ 26, (నవజ్యోతి ప్రతినిధి) :**

కీసర పోలీస్ స్టేషన్ పరిధిలోని సుభాష్‌నగర్ కాలనీలో అర్ధరాత్రి జరిగిన బైక్ చోరీ ఘటన స్థానికంగా ఆందోళనకు గురిచేసింది. ఇంటి ముందు పార్క్ చేసి ఉంచిన పల్సర్ 125 డీటీఎస్–ఐ (రిజిస్ట్రేషన్ నంబర్: ఎపి39ఎస్ ఎన్ 7808) ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని నలుగురు యువకులు అపహరించారు.బాధితుడు షేక్ షాహీద తెలిపిన వివరాల ప్రకారం, గురువారం రాత్రి బైక్‌ను ఇంటి ముందు నిలిపి నిద్రకు వెళ్లగా, శుక్రవారం ఉదయం బయటకు వచ్చి చూడగా వాహనం కనిపించలేదు. వెంటనే తన కుమారుడు షేక్ తాహిర్ అహ్మద్‌తో కలిసి డయల్–100కు సమాచారం అందించి కీసర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.ఫిర్యాదు అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని ఆధారాలను పరిశీలించారు. పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల దృశ్యాలను సేకరించి, నలుగురు అనుమానిత



యువకుల కదలికలను విశ్లేషిస్తున్నారు. నిందితులను త్వరలోనే గుర్తించి పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలతో దర్యాప్తు కొనసాగుతున్నట్లు సమాచారం. ఇటీవలి కాలంలో వాహనాల చోరీలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాహనాలకు అదనపు భద్రతా తాళాలు అమర్చుకోవాలని, సీసీ కెమెరాల నిఘా ఉన్న ప్రదేశాల్లోనే పార్క్ చేయాలని పోలీసులు సూచించారు.

# రామాయంపేటలో మహిళా జొన్న రైతుల రాస్తారోకో

- **జొన్న కొనుగోళ్లు వెంటనే ప్రారంభించాలి**
- **నెల రోజులుగా కొనుగోళ్లు లేక రైతుల ఆందోళన..**
- **ప్రభుత్వంపై సీపీఎం విమర్శలు**

**రామాయంపేట, జూన్ 26 (నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్) :**

జొన్న కొనుగోళ్లలో జాప్యాన్ని నిరసిస్తూ రామాయంపేట లో మహిళా రైతులు ఆందోళనకు దిగారు. నెల రోజులుగా జొన్నలను కొనుగోలు చేస్తామని అధికారులు హామీలు ఇస్తున్నప్పటికీ కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతో మహిళా రైతులు పాత జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. గంటపాటు రహదారిపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో హైవేపై ఇరువైపులా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని రైతులతో చర్చించి ఆందోళనను విరమింపజేశారు.రాష్ట్ర ప్రభుత్వం ఆరుతడి పంటల సాగును ప్రోత్సహిస్తూ రైతులను జొన్న సాగు చేయాలని ప్రోత్సహించిందని, అయితే పంట చేతికి వచ్చిన తర్వాత కొనుగోళ్ల విషయంలో నిర్లక్ష్యం చేస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వరి, మక్కలను కొనుగోలు చేసిన ప్రభుత్వం జొన్నల కొనుగోలుకు ముందుకు రావడం లేదని ఆరోపించారు.జొన్నలను వెంటనే ప్రభుత్వమే



మద్దతు ధరకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. కొనుగోళ్లు ప్రారంభించకపోతే రైతులతో కలిసి ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# జొన్న రైతుల గోడు వినని రాష్ట్ర ప్రభుత్వం..

- **కొనుగోళ్లు లేక రైతుల అవస్థలు.**
- **పంట మార్పిడితో రైతులు నష్టపోయారు..**
- **జొన్న రైతులను ఆదుకోవాలి కొనుగోళ్లు ప్రారంభించకపోతే కలెక్టరేట్ ముట్టడి.**
- **మాజీ డిప్యూటీ స్పీకర్ యం. పద్మా దేవేందర్ రెడ్డి..**





**రామాయంపేట, జూన్ 26 (నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్) :**

మెదక్ జిల్లా రామాయంపేట మండలం దంతపల్లి, కాట్రియాల, పర్వతాపూర్ గ్రామాల్లో జొన్న సాగు చేసిన రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.శుక్రవారం రామాయంపేట మార్కెట్ యార్డును బిఆర్ఎస్ నాయకులతో కలసి సందర్శించారు. జొన్న రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ...నెల రోజులుగా మార్క్‌ఫెడ్ ద్వారా జొన్నల కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. గతంలో వరి ధాన్యం కొనుగోలు విషయంలో కూడా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నాలు, రాస్తారోకాలు నిర్వహించి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంతోనే కొనుగోళ్లు ప్రారంభించారని గుర్తు చేశారు.అధికారుల సూచనల మేరకు పంట మార్పిడిలో భాగంగా రైతులు జొన్న సాగు చేశారని, ఇప్పుడు పంట చేతికొచ్చినా కొనుగోళ్లు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరిపై ఒకరు నిందలు వేసుకోవడం తప్ప రైతులకు న్యాయం చేయడం లేదని మండిపడ్డారు.మార్పిడి ద్వారా నాలుగు లారీల జొన్నలను కొనుగోలు చేసి,మట్టిపెళ్లలు ఉన్నాయనే సాకుతో తిరస్కరించారని రైతులు తన దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు.ఈ విషయాన్ని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మార్క్‌ఫెడ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించి కొనుగోళ్లకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు చెప్పారు.సోమవారంలోగా జొన్నల కొనుగోలుపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోకపోతే రైతులతో కలిసి కలెక్టరేట్ వద్ద భారీ ఉద్యమం చేపడతామని పద్మా దేవేందర్ రెడ్డి హెచ్చరించారు.

# త్యాగానికి ప్రతీక మొహర్రం

- **హైదర్‌నగర్‌లో పీర్లను దర్శించుకున్న అరెకపూడి గాంధీ**

**కూకట్‌పల్లి, జూన్ 26 ( నవజ్యోతి ప్రతినిధి) :**

మొహర్రం మాసం ముస్లింల త్యాగాలకు, ధర్మ పోరాటానికి ప్రతీక అని పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ పేర్కొన్నారు. హైదర్ నగర్ డివిజన్ పరిధిలో నిర్వహించిన మొహర్రం వేడుకల్లో మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావుతో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని పీర్లను దర్శించుకున్నారు.ఈ సందర్భంగా అరెకపూడి గాంధీ



మాట్లాడుతూ ఇస్లామిక్ క్యాలెండర్‌లో మొదటి పవిత్ర మాసమైన మొహర్రం ముస్లింల నూతన సంవత్సర ఆరంభమన్నారు. ఇది కేవలం పండుగ మాత్రమే కాదని, మహమ్మద్ ప్రవక్త మనవడైన హజరత్ ఇమామ్ హుస్సైన్, ఆయన కుటుంబ సభ్యుల అమరత్వాన్ని స్మరించుకునే సంతాప దినాలని తెలిపారు. కర్బలా యుద్ధంలో వీరుల త్యాగాలకు గుర్తుగా హస్తాకృతి కలిగిన పీర్లను అలంకరించి భక్తిశ్రద్ధలతో ఊరేగిస్తారని, అందుకే దీనిని పీర్ల పండుగ అని కూడా పిలుస్తారని వివరించారు. ముఖ్యంగా మొహర్రం నెలలో పదవ రోజైన 'ఆషూరా' అత్యంత పవిత్రమైనదని, ఈ రోజున ముస్లిం సోదరులు విచారం వ్యక్తం చేస్తూ సంతాప ఊరేగింపులు నిర్వహిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలింగ్ గౌతమ్ గౌడ్, పోతుల రాజేందర్, చాట్ల రవి, రాజి రెడ్డి, షరీఫ్, యాసిన్, నిఖిల్, హమీద్, ఫసి, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన విద్యార్థులకు ప్రోత్సాహము

- **విద్యాభివృద్ధికి సర్పంచ్ విజేందర్ రెడ్డి వినూత్న నిర్ణయం**

**పుల్కల్, జూన్ 26 (నవజ్యోతి ప్రతినిధి):**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలను పెంచేందుకు, విద్య పట్ల గ్రామ ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఇసోజిపేట గ్రామ సర్పంచ్ లకుడారం విజేందర్ రెడ్డి వినూత్న నిర్ణయం తీసుకున్నారు. గ్రామంలోని ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు ఉన్న పిల్లలను ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చేర్పించిన కుటుంబాల ఇంటి పన్నును తానే చెల్లిస్తానని ప్రకటించారు.సర్పంచ్ ప్రకటించిన ఈ ప్రత్యేక ప్రోత్సాహకానికి గ్రామ ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. దీంతో పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. ఇప్పటివరకు 12 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో కొత్తగా అడ్మిషన్ పొందగా, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న కొంతమంది విద్యార్థులు కూడా ప్రభుత్వ పాఠశాలకు మారినట్లు సమాచారం.ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం సర్పంచ్ విజేందర్ రెడ్డి చేపట్టిన కార్యక్రమం అభినందనీయమని పేర్కొన్నారు. గ్రామంలో విద్యా ప్రమాణాల పెంపుతో పాటు ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసం పెంచేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుందని అన్నారు.పాఠశాల ఉపాధ్యాయులు కూడా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ, బోధనలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. విద్యార్థుల సంఖ్య పెరగడంతో ప్రభుత్వ పాఠశాల మరింత



బలోపేతం కావడంతో పాటు, గ్రామంలో విద్యా వాతావరణం మరింత మెరుగుపడుతుందని గ్రామ పెద్దలు ఆశాభావం వ్యక్తం చేశారు.సర్పంచ్ విజేందర్ రెడ్డి చేపట్టిన ఈ వినూత్న కార్యక్రమం ఇతర గ్రామాలకు కూడా ఆదర్శంగా నిలుస్తోందని పలువురు అభిప్రాయపడ్డారు.

# మాదకద్రవ్యాల పై అవగాహనకు ఐ.ఎఫ్.హెచ్.ఈ వినూత్న కార్యక్రమం.




**ఉమ్మడి రంగారెడ్డి, జూన్ 26, (నవజ్యోతి ప్రతినిధి శివారెడ్డి):**

విద్యార్థుల్లో మాదకద్రవ్యాల వినియోగంపై అవగాహన పెంపొందించి, వ్యసనరహితమైన ఆరోగ్యకరమైన విద్యా వాతావరణాన్ని నిర్మించాలనే లక్ష్యంతో ఐఎఫ్‌హెచ్‌ఈ హైదరాబాద్‌లో "నిరామయ తరంగం" మాదకద్రవ్యాల నిరోధక విభాగం పరిచయ కార్యక్రమం, బాధ్యతల స్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ప్రారంభంలో "పవిత్రత యొక్క అల – స్వేచ్ఛతో కూడిన జీవితం" అనే నినాదంతో రూపొందిన "నిరామయ తరంగం" లక్ష్యాలను వివరించారు. మాదకద్రవ్యాల నిర్మూలన కోసం అవగాహన కల్పించడం, సామాజిక బాధ్యతను పెంపొందించడం, ప్రతి విద్యార్థిలో నైతిక విలువలను బలోపేతం చేయడం ఈ విభాగం ప్రధాన ధ్యేయమని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఐఎఫ్‌హెచ్‌ఈ హైదరాబాద్ ఉపకులపతి ప్రొఫెసర్ టి. కోటి రెడ్డి, భవిష్యత్ నగర పోలీసు విభాగం పరిధిలోని మోకిలా పోలీసు స్టేషన్ సిఐ ఎస్. శ్రీనివాస్ రెడ్డి, ఎస్సెలు సురేష్ గౌడ్, పద్మ, ఐబీఎస్ హైదరాబాద్ సంచాలకులు ప్రొఫెసర్ ఎస్. వేణుగోపాల్ రావు, సంయుక్త రిజిస్ట్రార్ వి. మధుసూదన్ రావు, విద్యార్థి కార్యకలాపాల సమన్వయకర్త ప్రొఫెసర్ మాధవి గరికపర్తి, అదనపు రిజిస్ట్రార్ సమద్ నూరుస్ తదితరులు హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. సభలో మాట్లాడిన ఎస్. శ్రీనివాస్ రెడ్డి మాదకద్రవ్యాల వినియోగం వల్ల వ్యక్తి, కుటుంబం, సమాజం ఎదుర్కొనే తీవ్రమైన దుష్పరిణామాలను వివరించారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ బాధ్యతాయుతమైన నిర్ణయాలు తీసుకోవాలని, మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రతి విద్యార్థి చురుకైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. సమాజంలో సానుకూల మార్పుకు యువతే మార్గదర్శకులని ఆయన పేర్కొన్నారు. ప్రసంగించిన ప్రముఖులు మాదకద్రవ్యాల నిర్మూలనలో అవగాహన, నివారణ చర్యలు, విద్యార్థుల భాగస్వామ్యం అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి బాధ్యత, క్రమశిక్షణ, నిజాయితీ, మానవతా విలువలను పాటిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఆకర్షణగా బాధ్యతల స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించి, కొత్తగా నియమితులైన సభ్యులకు అధికారికంగా బాధ్యతలు అప్పగించారు. అనంతరం వారు మాదకద్రవ్యాల నిర్మూలనకు అంకిత భావంతో కృషి చేస్తామని, విద్యార్థుల్లో నిరంతరం అవగాహన కల్పిస్తూ ఆరోగ్యకరమైన, సురక్షితమైన విద్యా ప్రాంగణాన్ని నిర్మించేందుకు కట్టుబడి పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు ప్రత్యేక నాటికను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనకు పలు విద్యార్థి సంఘాలు సహకారం అందించగా, కార్యక్రమాన్ని మరో విద్యార్థి బృందం దృశ్యరూపంలో నమోదు చేసింది. కొత్తగా నియమితులైన సభ్యులు తమ బాధ్యతలను స్వీకరించగా, నిర్వహణ సంఘ సభ్యులు కార్యక్రమ నిర్వహణలో కీలక పాత్ర పోషించారు. ఈ కార్యక్రమం ముగింపులో కృతజ్ఞతలు తెలియజేస్తూ, కార్యక్రమ విజయానికి సహకరించిన ముఖ్య అతిథులు, అధ్యాపకులు, విద్యార్థులు, నిర్వాహకులకు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# ఓట్ల సవరణపై కాంగ్రెస్ నిఘా



## • నిర్లక్ష్యం వహిస్తే చర్యలు : బండి రమేష్ హెచ్చరిక

**కూకట్‌పల్లి, జూన్ 26 (నవజ్యోతి ప్రతినిధి) :**

ఓటర్ల జాబితా సవరణ, కొత్త ఓట్ల నమోదు ప్రక్రియలో పార్టీ శ్రేణులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ పిలుపునిచ్చారు. ఓట్ల నమోదు విషయంలో నిర్లక్ష్యం వహించే నాయకులను సహించేది లేదని, వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ కార్యాలయం హేమదుర్గాభవన్‌లో శుక్రవారం పార్టీ నియోజకవర్గ స్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన బండి రమేష్ మాట్లాడుతూ.. ప్రతి డివిజన్‌లో అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు నమోదయ్యేలా నాయకులు క్షేత్రస్థాయిలో బాధ్యత తీసుకోవాలని, ఓటర్లకు అవసరమైన పూర్తి సహకారం అందించాలని దిశానిర్దేశం చేశారు. రాబోయే రోజుల్లో పార్టీ బలోపేతానికి ఈ ప్రక్రియ అత్యంత కీలకమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, మహిళా బ్లాక్ అధ్యక్షురాళ్లు, డివిజన్ మహిళా అధ్యక్షురాళ్లు పాల్గొని పలు సూచనలు తీసుకున్నారు.

# వైటీపీఎస్‌లో సీహెచ్‌పీ, ఏహెచ్‌పీ విభాగాల ప్రైవేటీకరణను విరమించుకోవాలి

- స్థానిక నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలి
- వైటిపిఎస్ ఉద్యోగ జేఏసీకి సిపిఐ సంపూర్ణ మద్దతు
- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు డిమాండ్

**దామరచర్ల, జూన్ 26 (నవజ్యోతి ప్రతినిధి) :**



యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ లోని కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ (సీహెచ్‌పీ), యాష్ హ్యాండ్లింగ్ ప్లాంట్ (ఏహెచ్‌పీ) నిర్వహణను ప్రైవేటీకరించేందుకు ప్రభుత్వం చేపట్టిన టెండర్ల ప్రక్రియను వెంటనే ఉపసంహరించుకుని, స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు, దామరచర్ల మండల కార్యదర్శి పోలేపల్లి ఉదయ్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం దామరచర్ల మండలం వీర్లపాలెంలోని వైటీపీఎస్ ప్రధాన గేటు వద్ద సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో వారు పాల్గొని ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బంటు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, యాదాద్రి పవర్ ప్లాంట్ తొలి, రెండో దశ యూనిట్లకు సంబంధించిన ఆపరేషన్, మెయింటెనెన్స్, మెకానికల్, ఎలక్ట్రికల్ పనులను ఉద్యోగుల కొరత పేరుతో మూడేళ్లపాటు ప్రైవేట్ కాంట్రాక్టర్లకు అప్పగించేందుకు ఈ నెల 12 నుంచి 29 వరకు టెండర్లు ఆహ్వానించడం సమంజసం కాదన్నారు. తెలంగాణను విద్యుత్ మిగులు రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో సుమారు రూ.35 వేల కోట్ల వ్యయంతో నిర్మించిన యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ద్వారా స్థానిక భూ నిర్వాసితులు, నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ప్రస్తుతం నాలుగు యూనిట్లు ప్రారంభమై మొత్తం 3,200 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతున్నప్పటికీ, ఇచ్చిన ఉద్యోగ హామీలు అమలు కాలేదని విమర్శించారు. ప్లాంట్ నిర్వహణకు సుమారు 4,000 మంది సిబ్బంది అవసరమైతే ప్రస్తుతం కేవలం 1,262 మంది మాత్రమే పనిచేస్తున్నారని, దీనివల్ల ఉత్పత్తిపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. భూ నిర్వాసితులకు పెద్దఎత్తున ఉద్యోగాలు ఇస్తామని చెప్పి కేవలం 500 మందికే అవకాశం కల్పించారని, స్థానికంగా 2,000 మందికి ఉపాధి కల్పిస్తామని ఇచ్చిన హామీ కూడా నెరవేర్చలేదని ఆరోపించారు. ప్రభుత్వం ఉద్యోగ నియామకాలు చేపట్టకుండా ప్రభుత్వ రంగ ప్లాంట్‌ను ప్రైవేటీకరించే ప్రయత్నాలు చేయడం సరికాదని, ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో స్థానిక ప్రజలు, భూ నిర్వాసితులు, నిరుద్యోగ యువతతో కలిసి పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. వైటీపీఎస్ ఉద్యోగుల జేఏసీ చేపట్టిన ఉద్యమానికి సీపీఐ సంపూర్ణ మద్దతు ఉంటుందని వారు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు జమ్ముల కోటయ్య, గజ్జల లక్ష్మీ నరసింహారెడ్డి, పెదపాక వెంకటేష్, పవన్, గాంధీ, కాశయ్య, రమేష్, సత్యానందం, సూర్యం, మహేష్‌బాబు, రాము, రవినాయక్, కృపాకర్ తదితరులు పాల్గొన్నారు.

# జొన్న రైతుల సమస్య పరిష్కారానికి చొరవ తీసుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య నాగరాజు.

## • మార్క్‌ఫెడ్ అధికారులతో మాట్లాడించి కొనుగోళ్లకు మార్గం సుగమం.

**రామాయంపేట, జూన్ 26 ( నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్ ) :**

మెదక్ జిల్లా రామాయంపేట మున్సిపాలిటీలోని మార్కెట్ కమిటీ వద్ద జొన్న కొనుగోళ్లను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేపట్టిన రైతులను మున్సిపల్ చైర్‌పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు పరామర్శించారు. రైతుల సమస్యలను ఓర్పుగా విని, వారి ఇబ్బందులను తెలుసుకున్నారు.అనంతరం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్ రావుతో ఫోన్‌లో మాట్లాడి రైతుల సమస్యను వివరించారు. ఆయన చొరవతో మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్‌తో రైతులకు నేరుగా మాట్లాడించి, జొన్న కొనుగోళ్ల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకునేలా సమన్వయం చేశారు.ఈ సందర్భంగా రైతులు తమ సమస్యపై వెంటనే స్పందించి అధికారులతో మాట్లాడించిన మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య నాగరాజు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్ రావుకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు చింతల యాదగిరి, మాజీ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు దాకి స్వామి, విరాట్, సుధీర్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.



# కన్నులపండువగా శ్రీవారి జ్యేష్ఠాభిషేకం





## • సెవెన్ హిల్స్ వెంకటేశ్వరస్వామి ఆలయంలో 1008 కలశాభిషేకం

**కూకట్‌పల్లి, జూన్ 26 (నవజ్యోతి ప్రతినిధి) :**

జ్యేష్టాభిషేకం లాంటి గొప్ప ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణ వల్ల సమాజం సుభిక్షంగా ఉంటుందని, ప్రజలందరిపైన ఆ శ్రీవారి కృపాకటాక్షాలు మెండుగా కలుగుతాయని పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ పేర్కొన్నారు. హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని నిజాంపేట్ రోడ్డు సెవెన్ హిల్స్ కాలనీలో వెలసిన శ్రీ పద్మావతి గోదాసమేత శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో లోకకల్యాణార్థం శ్రావణ జ్యేష్ట మాస ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా ఆలయంలో 1008 కలశములతో నిర్వహించిన సహస్ర కలశాభిషేకం, శ్రీవారి జ్యేష్టాభిషేకం మహోత్సవంలో దేవాలయ ఈఓ సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావుతో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా అరెకపూడి గాంధీ మాట్లాడుతూ జ్యేష్ట మాసంలో స్వామివార్లకు జరిగే అభిషేకానికి ఎంతో విశిష్టత ఉందన్నారు. మూర్తులకు ఎటువంటి హాని కలగకుండా రక్షణగా నిలిచేందుకు ఏటా ఈ జ్యేష్టాభిషేకం నిర్వహించడం సాంప్రదాయమన్నారు. ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి, అమ్మవార్లకు పాలు, పెరుగు, తేనె, నెయ్యి, పంచదార, చెరుకు రసం, ఫలరసాలతో పాటు జాజికాయ, లవంగాలు, జాపత్రి, యాలకులు, పచ్చకర్పూరం, కచ్చులం, కస్తూరి వంటి అనేక రకాల అరుదైన సుగంధ ద్రవ్యములతో తిరుమంజనము, అభిషేకం విశేషంగా జరిపినట్లు చెప్పారు.ఇంతటి మహత్తర ఆధ్యాత్మిక వేడుకలో భాగస్వామ్యం కావడం పూర్వజన్మ సుకృతమని, నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. అంతకుముందు ఆలయానికి చేరుకున్న పీఏసీ చైర్మన్కు అర్చకులు, కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. పూజా కార్యక్రమాల అనంతరం వేద పండితులు ఆయనకు ఆశీర్వచనం అందించి స్వామివారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన ముఖ్య నాయకులు, కాలనీ ప్రతినిధులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# అనుమానాస్పద స్థితిలో గర్భిణీ మృతి

**ఉమ్మడి మెదక్ జిల్లా, జూన్ 26 (నవజ్యోతి ప్రతినిధి) :**



ఐదు నెలల గర్భిణి అనుమానాస్పద స్థితిలో ఉరి వేసుకుని మృతి చెందిన ఘటన అల్లాదుర్గం మండలంలో చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై శంకర్ తెలిపిన వివరాల ప్రకారం వికారాబాద్ జిల్లా కోటపల్లి గ్రామానికి చెందిన సుష్మిత (23) కు మండలంలోని గడి పెద్దాపురం గ్రామానికి చెందిన అభిలాష్ తో 18 నెలల క్రితం వివాహం జరిగింది. వివాహం అయిన కొన్ని రోజుల నుండి భార్యాభర్తల మధ్య గొడవలు మొదలయ్యాయి.భార్యను అనుమానంతో తరచూ హింసించేవాడనీ, భార్య ఐదు నెలల గర్భిణీ , ఆమెను అనుమానిస్తూ తరచుగా డీఎన్ఏ పరీక్షలు చేయించాలని మొండికేశాడు. గురువారం రాత్రి సుస్మిత ఇంట్లోనే దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది అని తెలిపారు. మృతురాలు తల్లి తన కూతురుపై పలు అనుమానాలు ఉన్నట్లు సుస్మిత మృతికి భర్త అభిలాష్, అత్త శశిరేఖ కారణమంటూ మృతురాలు తల్లి జనాభాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శంకర్ తెలిపారు.

# మరో అరుదైన ఘనత సాధించిన న్యాయవాది సుంకర నరేష్

- 12వ తెలంగాణ రాష్ట్ర షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో ప్రతిభ
- సౌత్ జోన్, ఓపెన్ నేషనల్, ప్రీ-నేషనల్ పోటీలకు అర్హత

**కాప్రా, జూన్ 26, (నవజ్యోతి ప్రతినిధి) :**

కాప్రాకు చెందిన ప్రముఖ న్యాయవాది, సామాజిక కార్యకర్త, రాజకీయ నాయకుడు సుంకర నరేష్ మరోసారి తన ప్రతిభను చాటుకున్నారు. గచ్చిబౌలిలోని తెలంగాణ షూటింగ్ రేంజ్‌లో జూన్ 20 నుంచి 25 వరకు నిర్వహించిన 12వ తెలంగాణ రాష్ట్ర రైఫిల్ అండ్ పిస్టల్ షూటింగ్ ఛాంపియన్‌షిప్–2026లో అత్యుత్తమ ప్రదర్శన చేసి సౌత్ జోన్, ఓపెన్ నేషనల్, ప్రీ–నేషనల్ షూటింగ్ పోటీలకు అర్హత సాధించారు.

### 50 మీటర్ల పిస్టల్ విభాగంలో అర్హత స్కోరు

సీనియర్ పురుషుల వ్యక్తిగత విభాగంలోని 50 మీటర్ల పిస్టల్ ఫైర్ ఆర్మ్ (.22 బుల్లెట్) ఈవెంట్‌లో రాష్ట్ర అర్హత స్కోరును నమోదు చేసి జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశాన్ని దక్కించుకున్నారు.

### కఠోర సాధనే విజయానికి కారణం

గత కొన్ని నెలలుగా తెలంగాణ రాష్ట్ర ప్రధాన కోచ్ వారణాసి సందీప్ కుమార్ వద్ద శిక్షణ పొందుతూ, ప్రముఖ నేషనల్ షూటర్ కిశోర్ పర్యవేక్షణలో నిరంతరం సాధన చేయడం వల్లే ఈ విజయం సాధ్యమైందని సుంకర నరేష్ తెలిపారు. ఆరోగ్య సమస్యలను అధిగమించి పట్టుదలతో సాధన కొనసాగించడం విశేషం.






### పలువురి అభినందనలు

న్యాయవాదిగా, సామాజిక కార్యకర్తగా, రాజకీయ నాయకుడిగా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూనే క్రీడా రంగంలోనూ ప్రతిభ చాటుతున్న సుంకర నరేష్‌కు పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు. రానున్న జాతీయ స్థాయి పోటీల్లోనూ రాణించి తెలంగాణకు మరిన్ని విజయాలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# మ్యాన్‌హోల్స్ సమస్యతో ఇళ్లలోకి చేరుతున్న వర్షపు నీరు



- రాజీవ్ గృహకల్పలో డ్రైనేజీ సమస్యలపై వినోద్ కుమార్ తక్షణ స్పందన
- డ్రైనేజీ క్లీనింగ్‌తో ఊపిరి పీల్చుకున్న స్థానికులు



**కుత్బుల్లాపూర్, జూన్ 26 (నవజ్యోతి ప్రతినిధి):**

కొంపల్లి సర్కిల్ పరిధిలోని సూరారం ప్రాంతంలోని 37, 38, 39, 40 రాజీవ్ గృహకల్ప భవనాల మధ్య నెలకొన్న డ్రైనేజీ సమస్యపై స్థానికులు బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు వారాల వినోద్ కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. సమస్య తీవ్రతను అర్థం చేసుకున్న ఆయన వెంటనే స్పందించి మున్సిపల్ సిబ్బందిని సంఘటనా స్థలానికి రప్పించి డ్రైనేజీ లైన్లను శుభ్రం చేయించారు.స్థానికుల వివరాల ప్రకారం డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ దిగువ స్థాయిలో ఉండటంతో వర్షపు నీరు, మంచినీటి లీకేజీలు గల్లీల్లో నిల్వి భవనాల లోపలికి చేరుతున్నాయని తెలిపారు. దీంతో నివాసితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు వినోద్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు.అదేవిధంగా కాలనీలో రహదారి సమస్యలను కూడా ఆయనకు వివరించగా, వెంటనే మున్సిపల్ మరియు వాటర్ వర్క్స అధికారులతో మాట్లాడి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించినట్లు తెలిసింది. ప్రజా సమస్యలపై తక్షణ స్పందన చూపిన బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు వారాల వినోద్ కుమార్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానికులు రవికుమార్, జయసింహారెడ్డి, నరసింహ గౌడ్, బాలాచారి, ప్రసాద్, బద్రి, శ్యామ్, నాగయ్య పాల్గొన్నారు. అలాగే సీనియర్ నాయకులు రాజ్‌కుమార్ ముదిరాజ్, నారాయణ, వేణు ముదిరాజ్, అనిల్ తదితరులు హాజరయ్యారు.



# తెల్లవారుజామున వృద్ధ దంపతుల ఇంట్లో చోరీ

- వృద్ధురి మెడలోని ఐదు తులాల బంగారు పుస్తెలతాడు అపహరణ
- కీసరలో కలకలం






**కీసర, జూన్ 26 (నవజ్యోతి ప్రతినిధి) :**

మేడ్చల్–మల్కాజ్గిరి జిల్లా కీసర మండలం చీర్యాల గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన చోరీ ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఒంటరిగా నివసిస్తున్న వృద్ధ దంపతులను లక్ష్యంగా చేసుకున్న గుర్తు తెలియని దుండగుడు ఇంట్లోకి చొరబడి వృద్ధురి మెడలో ఉన్న సుమారు ఐదు తులాల బంగారు పుస్తెలతాడును అపహరించి పరార య్యాడు.బాధితులు సింగిరెడ్డి మల్లారెడ్డి (80), మల్లమ్మ (75) దంపతులు చీర్యాల గ్రామంలోని తమ స్వగృహంలో నివసిస్తున్నారు. శుక్రవారం ఉదయం సుమారు 5 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి వారి ఇంటి తలుపు తట్టాడు. "ఎవరు?" అని మల్లమ్మ ప్రశ్నించగా, ఎలాంటి అనుమానం లేక తలుపు తెరిచింది. అదే అవకాశంగా భావించిన దుండగుడు ఒక్కసారిగా ఇంట్లోకి దూసుకెళ్లి తలుపుకు గడియ పెట్టాడు.ఆపై వృద్ధురిని బెదిరించి ఆమె మెడలో ఉన్న సుమారు ఐదు తులాల బంగారు పుస్తెలతాడును బలవంతంగా లాక్కొని అక్కడి నుంచి వేగంగా పరారయ్యాడు. ఈ ఘటనతో భయాందోళనకు గురైన వృద్ధ దంపతులు గట్టిగా కేకలు వేయగా, స్థానికులు అక్కడికి చేరుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. బాధితుల కుమారులు కీసర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. వేలిముద్రల నిపుణులను రప్పించి ఆధారాలు సేకరించడంతో పాటు పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలిస్తున్నారు. నిందితుడిని త్వరలోనే గుర్తించి అరెస్టు చేస్తామని పోలీసులు తెలిపారు.గ్రామాల్లో వృద్ధులు ఒంటరిగా నివసిస్తున్న ఇళ్లనే లక్ష్యంగా చేసుకుని ఇలాంటి ఘటనలు జరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అపరిచితులకు తలుపులు తీయడానికి ముందు పూర్తిగా నిర్ధారించుకోవాలని పోలీసులు సూచించారు.

# త్యాగానికి ప్రతీక మొహర్రం.

- టేక్మాల్‌లో ఘనంగా పీర్ల పండుగ.
- మత సామరస్యానికి నిదర్శనంగా నిలిచిన వేడుకలు.





**టేక్మాల్, జూన్ 26 (నవజ్యోతి ప్రతినిధి) :**

ధర్మం, సత్యం మరియు త్యాగనిరతికి ప్రతీకగా నిలిచే మొహర్రం పండుగను మెదక్ జిల్లా టేక్మాల్ మండల వ్యాప్తంగా శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కులమతాలకు అతీతంగా నిర్వహించిన ఈ పీర్ల పండుగ వేడుకల్లో ప్రజలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని, తెలంగాణ గడ్డపై గంగా–జమున తెహజీబ్ (మత సామరస్యం)ను చాటారు.ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న గ్రామ సర్పంచ్ తిమ్మిగారి సుధాకర్ మాట్లాడుతూ, ముస్లిం సోదరుల త్యాగాలను స్మరించుకుంటూ జరుపుకునే ఈ పండుగ, మన సంస్కృతిలో భాగమైందని పేర్కొన్నారు. "తెలంగాణలో పీర్ల పండుగ పేరుతో హిందూ, ముస్లిం సోదరులు కలిసిమెలిసి వేడుకలు జరుపుకోవడం మన గొప్పదనం. ఇది లౌకికత్వానికి నిదర్శనం" అని ఆయన కొనియాడారు.పండుగ వేడుకలు గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించాయి. చిన్నా పెద్దా, మహిళలు అనే తేడా లేకుండా ప్రజలందరూ పీర్ల సాక్షిగా ఎంతో భక్తితో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలు 'ఆశన్న.. ఉషన్న' అంటూ పాడుతూ, ఆటపాటలతో భక్తిని చాటుకున్నారు. పల్లె నుంచి పట్నం వరకు పీర్ల పండుగ వేడుకలు సందడిగా సాగాయి. ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ప్రజలందరిలో శాంతి కరుణ సోదర భావాలు పెంపొందాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ఆయా పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# మేడ్చల్‌లో ఆదిత్య బిర్లా ఫ్యాషన్ షోరూమ్ ప్రారంభం

- రిబ్బన్ కట్ చేసిన ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

**మేడ్చల్, జూన్26 (నవజ్యోతి ప్రతినిధి) :**



మేడ్చల్ నియోజకవర్గ కేంద్రంలో ప్రముఖ సంస్థ ఆదిత్య బిర్లా గ్రూప్ వారి నూతన ఫ్యాషన్ షోరూమ్ ఘనంగా ప్రారంభమైంది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి మేడ్చల్ నియోజకవర్గ శాసనసభ్యులు, మాజీ మంత్రివర్యులు చామకూర మల్లారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన షోరూమ్‌ను రిబ్బన్ కట్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం షోరూమ్ ప్రాంగణాన్ని కలియతిరుగుతూ, అందుబాటులో ఉన్న వస్త్రశ్రేణిని పరిశీలించారు. మేడ్చల్ వంటి అభివృద్ధి చెందుతున్న ప్రాంతంలో ఇటువంటి ప్రతిష్టాత్మక బ్రాండ్ షోరూమ్ ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇది స్థానిక ప్రజలకు నాణ్యమైన మరియు ఆధునిక ఫ్యాషన్ దుస్తులను దగ్గర చేయడమే కాకుండా, స్థానికులకు ఉపాధి అవకాశాలను కూడా కల్పిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య బిర్లా సంస్థ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వ్యాపారవేత్తలు మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# యువతను కాపాడేందుకే నషా ముక్త్ భారత్



- శ్రీ చైతన్య కళాశాలలో దుండిగల్ పోలీసుల అవగాహన
- డ్రగ్స్ ఫ్రీ ఇండియా లక్ష్యానికి విద్యార్థుల ప్రతిజ్ఞ

**కుత్బుల్లాపూర్, జూన్ 26 (నవజ్యోతి ప్రతినిధి)**

యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడటం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని దుండిగల్ పోలీసులు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "నషా ముక్త్ భారత్ అభియాన్" కార్యక్రమంలో భాగంగా దుండిగల్ పరిధిలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీసులు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే ప్రమాదకరమైన వ్యసనమని హెచ్చరించారు. డ్రగ్స్ వినియోగం కారణంగా ఆరోగ్య సమస్యలతో పాటు మానసిక ఆందోళనలు, కుటుంబ విభేదాలు, సామాజిక దూరం మరియు నేరప్రవర్తనలు పెరిగే ప్రమాదం ఉందని వివరించారు.ప్రస్తుతం సమాజంలో కొందరు యువతను ఆకర్షించేందుకు మత్తు పదార్థాలను వివిధ రూపాల్లో అందుబాటులోకి తెస్తున్నారని, విద్యార్థులు అలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సృజనాత్మక కార్యకలాపాలపై దృష్టి పెట్టడం ద్వారా ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవచ్చని తెలిపారు. మాదకద్రవ్యాల విక్రయం లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం ఎక్కడ తెలిసినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. డ్రగ్స్ నిర్మూలనలో విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యాసంస్థలు, సమాజం సమిష్టిగా పనిచేసినప్పుడే "డ్రగ్స్ ఫ్రీ ఇండియా" లక్ష్యం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో దుండిగల్ పిఎస్ ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని "నషా ముక్త్ భారత్" లక్ష్య సాధనకు తమ వంతు బాధ్యత నిర్వర్తిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

# ప్రభుత్వ భూమిపై అక్రమ నిర్మాణాలు కలకలం

- నాగారంలో 1,184 గజాల ఆక్రమణ గుర్తింపు – నాలుగు ఇళ్ల నిర్మాణాలు నిలిపివేత
- దర్యాప్తులో అక్రమమని తేలితే కూల్చివేత తప్పదని అధికారుల హెచ్చరిక



**నాగారం, జూన్ 26, (నవజ్యోతి ప్రతినిధి) :**

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కీసర మండలం నాగారం మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ సీలింగ్ భూమిపై అక్రమ నిర్మాణాలు కలకలం రేపుతున్నాయి. నాగారం సర్వే నంబర్ 87/2లోని 6.04 ఎకరాల ప్రభుత్వ భూమిలో సుమారు 1,184 గజాలను ఆక్రమించి నాలుగు ఇళ్ల నిర్మాణాలు చేపట్టినట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు.సమాచారం అందుకున్న వెంటనే కీసర మండల తహసీల్దార్ యాదగిరి రెడ్డి సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అక్రమ నిర్మాణ పనులను వెంటనే నిలిపివేయించడంతో పాటు సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేశారు.ఈ విషయాన్ని ఘట్‌కేసర్ జోనల్ కమిషనర్, హైడ్రా అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, హైడ్రా బృందం కూడా స్థలాన్ని పరిశీలించి పరిస్థితిని సమీక్షించింది.దర్యాప్తులో ప్రభుత్వ భూమిపై అక్రమ నిర్మాణాలేనని తేలితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు నిర్మాణాలను కూల్చివేస్తామని అధికారులు హెచ్చరించారు. ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామని, ఆక్రమణలను ఏమాత్రం సహించబోమని తహసీల్దార్ యాదగిరి రెడ్డి స్పష్టం చేశారు.






# కాంట్రాక్టర్ నిర్లక్ష్యంపై కాలనీవాసుల ఆగ్రహం

- కృషి కాలనీ రోడ్ నెంబర్-5లో లీకేజీలతో సిసి రోడ్డుకు ముప్పు
- సమస్యపై స్పందించిన వారాల వినోద్ కుమార్..రంగంలోకి వాటర్ వర్క్స్ అధికారులు
- జేసీబీ తవ్వకాలతో దెబ్బతిన్న పైపులు..కొత్త సిసి రోడ్డుపై నీటి వృథా



**కుత్బుల్లాపూర్, జూన్ 26 (నవజ్యోతి ప్రతినిధి)**

కొంపల్లి సర్కిల్ పరిధిలోని సాయిబాబా నగర్ డివిజన్ కృషి కాలనీ రోడ్ నెంబర్–5లో చేపట్టిన రహదారి నిర్మాణ పనులు స్థానికులకు ఇబ్బందులను తెచ్చిపెట్టాయి. రోడ్డు పనుల కోసం జేసీబీతో తవ్వకాలు నిర్వహించే సమయంలో రోడ్ కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో మంజీరా పైపులు దెబ్బతిని పలు చోట్ల లీకేజీలు ఏర్పడ్డాయని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు.పైపుల నుంచి నీరు లీక్ అవుతున్న విషయాన్ని పనుల సమయం లోనే స్థానికులు పలుమార్లు కాంట్రాక్టర్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకుండా రోడ్డును అలాగే వేసేశారని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా ప్రస్తుతం కొత్తగా వేసిన సిసి రోడ్ పైన పైపులన్నీ లీకేజీలతో నీటి వృథా జరుగుతుండటంతో పాటు భవిష్యత్తులో సిసి రోడ్ డ్యామేజ్ అయ్యే అవకాశం ఉంటుందని స్థానికులు చెప్పుకొచ్చారు. తాగునీటి సరఫరాపై ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ సమస్యను కృషి కాలనీ వాసులు స్థానిక బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వారాల వినోద్ కుమార్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి వాటర్ వర్క్స్ అధికారులతో మాట్లాడారు. అనంతరం వాటర్ వర్క్స్ అధికారి మునీర్‌ను ప్రాంతానికి పిలిపించి సమస్య తీవ్రతను వివరించి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రజా సమస్యలపై అధికారులు, కాంట్రాక్టర్లు సమన్వయంతో వ్యవహరించకపోతే ప్రభుత్వ నిధులతో చేపట్టే అభివృద్ధి పనులే ప్రజలకు ఇబ్బందిగా మారతాయని స్థానికులు విమర్శించారు. పైపుల మరమ్మతులు పూర్తి చేసి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ప్రెసిడెంట్ బైరీష్ గౌడ్, జనరల్ సెక్రటరీ కిషోర్ ముదిరాజ్, సీనియర్ నాయకులు రాజ్‌కుమార్ ముదిరాజ్, రాము, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

# నాగారం–ధమ్మాయిగూడ రహదారిపై ప్రజల సహనానికి పరీక్ష

- నాలుగేళ్లుగా గుంతలే.. హామీలే తప్ప పనులు లేవు
- తక్షణమే రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలి.. లేదంటే ప్రజలతో కలిసి ఉద్యమం: తెలంగాణ రాజ్యాధికార పార్టీ



**నాగారం, జూన్ 26 (నవజ్యోతి ప్రతినిధి) :**

నాగారం చౌరస్తా నుంచి ధమ్మాయిగూడకు వెళ్లే ప్రధాన రహదారి దుస్థితిపై తెలంగాణ రాజ్యాధికార పార్టీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. నాలుగు నుంచి ఐదు సంవత్సరాలుగా రహదారి పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో వేలాది మంది ప్రజలు, వాహనదారులు ప్రతిరోజూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పార్టీ నాయకులు ఆరోపించారు. సమస్య పరిష్కారంలో ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో పార్టీ నాయకులు మాట్లాడుతూ, నాగారం–ధమ్మాయిగూడ ప్రధాన రహదారి రోజురోజుకూ మరింత ప్రమాదకరంగా మారుతోందన్నారు. భారీ గుంతలు, దుమ్ము, బురద కారణంగా వాహనదారులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. వర్షం పడితే రహదారిపై నీరు నిలిచి గుంతలు కనిపించకపోవడంతో ప్రమాదాల తీవ్రత మరింత పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.విద్యార్థులు పాఠశాలలకు, ఉద్యోగులు కార్యాలయాలకు, మహిళలు, వృద్ధులు ఆసుపత్రులకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అత్యవసర సమయంలో అంబులెన్స్‌లు కూడా వేగంగా వెళ్లలేని పరిస్థితి నెలకొనడం ఆందోళన కలిగించే అంశమని పేర్కొన్నారు.సుమారు నాలుగు నుంచి ఐదు నెలల క్రితం రహదారి విస్తరణ పేరుతో అధికారులు హడావుడిగా చెట్లను తొలగించి, రహదారి ఇరువైపులా ఉన్న చిన్న దుకాణాలు, షెడ్లను కూల్చివేశారని గుర్తు చేశారు. రహదారి పనులు వెంటనే ప్రారంభిస్తామని హామీ ఇచ్చినా, నేటికీ పనులు ప్రారంభం కాకపోవడంతో ఉపాధి కోల్పోయిన చిన్న వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజలకు నష్టం చేసి పనులు నిలిపివేయడం అన్యాయమని మండిపడ్డారు.ఈ సమస్యపై పలుమార్లు ఎమ్మెల్యే, ఎంపీ, మున్సిపల్ అధికారులు, రోడ్లు–భవనాల శాఖ అధికారులకు వినతిపత్రాలు అందజేసినా స్పందన రాలేదని ఆరోపించారు. పాలకుల నిర్లక్ష్యం కారణంగానే ఈ రహదారి ప్రజలకు శాపంగా మారిందని విమర్శించారు. నాగారం–ధమ్మాయిగూడ రహదారి పరిసర ప్రాంతాల్లో వేగంగా జనాభా పెరుగుతున్నప్పటికీ, ప్రధాన రహదారి అభివృద్ధి మాత్రం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందన్నారు. ఈ రహదారిపై ప్రతిరోజూ వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నందున, దీనిని అత్యవసర ప్రాధాన్యతతో పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ప్రభుత్వం వెంటనే స్పందించి రహదారి నిర్మాణ పనులను ప్రారంభించి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని, లేనిపక్షంలో ప్రజలను సమీకరించి నాగారం చౌరస్తా వద్ద భారీ ధర్నా, రాస్తారోకోతో పాటు దశలవారీ ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలంగాణ రాజ్యాధికార పార్టీ హెచ్చరించింది.ఈ సమావేశంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా జాయింట్ కార్యదర్శి గంగ్ర కమలాకర్ పటేల్, కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ పటేల్, జిల్లా అధికార ప్రతినిధి రామ్ నర్సయ్య పటేల్, యువ నాయకుడు సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.





# సంగారెడ్డిలో ఘనంగా మొహర్రం వేడుకలు..

- పీర్ల ఊరేగింపులో పాల్గొన్న జగ్గారెడ్డి, నిర్మల

**సంగారెడ్డి, జూన్ 26 (నవజ్యోతి ప్రతినిధి):**



సంగారెడ్డి పట్టణంలో మొహర్రం వేడుకలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో, మత సామరస్య వాతావరణంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి మొహర్రం పీర్ల ఊరేగింపులో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.ముందుగా పాత బస్టాండ్ సమీపంలోని దర్గా వద్దకు చేరుకున్న జగ్గారెడ్డి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పీర్ల ఊరేగింపులో పాల్గొని భక్తులను అభివాదం చేశారు. మొహర్రం వేడుకలను తిలకించేందుకు వందలాది మంది ప్రజలు హాజరై భక్తి, విశ్వాసాలతో పాల్గొన్నారు.మొహర్రం సందర్భంగా టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి ప్రజలకు షర్బత్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధారాణి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్, కూన సంతోష్, సంగారెడ్డి మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ హఫీజ్ తదితరులు పాల్గొని సేవా కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ, మొహర్రం పండుగ మత సామరస్యానికి ప్రతీక అని అన్నారు. కుల, మత భేదాలకు అతీతంగా ప్రజలంతా పెద్ద ఎత్తున వేడుకల్లో పాల్గొనడం ఆనందదాయకమన్నారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా మొహర్రం వేడుకలు ప్రశాంతంగా, ఘనంగా నిర్వహించబడడం సంతోషకరమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు తాహెర్, కుతుబుద్దీన్, నదీం, కౌసర్, ఇమ్రాన్, ఆమేర్ జాన్, హకీమ్, ఖమర్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.







# వియత్నాం విద్యార్థులకు కృత్రిమ మేధస్సులో శిక్షణ

- బూట్ క్యాంపు మెంటర్ గా గీతం అధ్యాపకుడు రెండు వారాల పాటు మార్గదర్శనం

**హైదరాబాద్, జూన్ 26 (నవజ్యోతి ప్రతినిధి) :**



వియత్నాంలోని హోచి మిన్ సిటీ, ట్రూంగ్ కావో డాంగ్ వియెన్ డాంగ్ లో జరిగే కృత్రిమ మేధస్సు లాంచ్ ప్యాడ్ బ్యూట్ క్యాంపుకు మెంటర్, రిసోర్స్ పర్సన్ గా సేవలందించేందుకు గీతం అధ్యాపకుడిని ఆహ్వానించారు. గీతం స్కూల్ ఆఫ్ సీఎస్ఈ లోని ఏఐ & డీఎస్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్న డాక్టర్ నిరంజన్ అప్పస్వామి, జూన్ 22 నుంచి జూలై 4 వరకు వియత్నాంలో పర్యటిస్తున్నారు. ఈ రెండు వారాల అంతర్జాతీయ విద్యా కార్యక్రమం, గీతం అధ్యాపకుల నైపుణ్యానికి, విద్యా నాయకత్వానికి ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న గుర్తింపును ప్రతిబింబిస్తుంది.వియెన్ డాంగ్ లో డాక్టర్ నిరంజన్ అప్పస్వామి పాల్గొనడం ఇది ఆరవసారి. ఇది ఈ రెండు సంస్థల మధ్య సహకార సంబంధాన్ని మరింత బలోపేతం చేస్తుంది. అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలకు ఆయన అందించిన నైపుణ్యాన్ని, కృషిని గుర్తించి, వియత్నాంలోని విద్యార్థులతో తన జ్ఞానాన్ని, అనుభవాన్ని పంచుకోవడానికి గీతం నాయకత్వం ఆయనను అనుమతించింది.72 గంటల ఆచరణాత్మక శిక్షణతో కూడిన ఏఐ లాంచ్ ప్యాడ్ బూట్ క్యాంప్, విద్యార్థులకు కృత్రిమ మేధస్సును ప్రాథమిక స్థాయి నుంచి పరిచయం చేయడానికి రూపొందించారు. దీని ద్వారా వారు కోడింగ్ లేదా గణితంలో విస్తృతమైన ముందస్తు పరిజ్ఞానం అవసరం లేకుండానే వాస్తవ ప్రపంచ ఏఐ అప్లికేషన్లను నిర్మించగలుగుతారు. ఓపెన్–సోర్స్ సాధనాలు, ఆచరణాత్మక అనువర్తనాల ద్వారా అనుభవపూర్వక అభ్యాసానికి ఈ కార్యక్రమం ప్రాధాన్యత ఇస్తుంది.ఈ బ్యూట్ క్యాంప్ పాఠ్య ప్రణాళిక నాలుగు అభ్యాస దశలుగా విభజించారు. ఏఐ ప్రాథమిక సూత్రాలు (విజువల్ లెర్నింగ్ – కోడింగ్ అవసరం లేదు), పైథాన్, మెషిన్ లెర్నింగ్ ఫండమెంటల్స్, ప్రాక్టికల్ ఏఐ అప్లికేషన్స్, ఏఐ ప్రాజెక్ట్ డెవలప్ మెంట్, డిప్లాయిమెంట్ వంటివి. ఈ మాడ్యూల్స్ ద్వారా, ఈ బూట్ క్యాంపులో పాల్గొనేవారు వాస్తవ–ప్రపంచ ఏఐ పరిష్కారాలను నిర్మించడం, పరీక్షించడం, అమలు చేయడంలో ప్రత్యక్ష అనుభవాన్ని పొందుతారు.డాక్టర్ నిరంజన్ అప్పస్వామి ఒక విశిష్ట సైబర్ సెక్యూరిటీ పరిజ్ఞాన నిపుణుడు, అంతర్జాతీయ విద్యావేత్త, అకడమిక్ సభ్యుడు. ఆయన ఇప్పటివరకు 22 పాఠ్య పుస్తకాలను రచించారు. ప్రస్తుతం ఐ ట్రిపుల్ ఈ సైబర్ సెక్యూరిటీ స్పెషల్ టెక్నికల్ కమ్యూనిటీ (ఎస్టీసీ)కి కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఆయన లింక్డ్ ఇన్ యొక్క 'ది సైబర్ డిఫెండర్', 'టీచింగ్ బియాండ్ ది టెక్స్ట్ బుక్' న్యూస్ లెటర్లకు సంపాదకుడిగా కూడా ఉన్నారు. అంతేగాక, సైబర్ సెక్యూరిటీ, కృత్రిమ మేధస్సు, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలపై బాగా పట్టు సాధించి, ప్రముఖ వక్తగా పేరు పొందారు.డాక్టర్ నిరంజన్ అంతర్జాతీయ విద్యా భాగస్వామ్యాన్ని గీతం నాయకత్వం ప్రశంసించింది. ఇటువంటి అవకాశాలు అధ్యాపక సభ్యుల నైపుణ్యాన్ని, విజయాలను గుర్తించడమే కాకుండా, విశ్వవిద్యాలయం యొక్క ప్రపంచవ్యాప్త గుర్తింపును, విద్యా ప్రతిష్టను కూడా పెంచుతాయని అభిలషిస్తున్నారు. అంతర్జాతీయ సహకారాలను పెంపొందించడానికి, బోధన, పరిశోధన, ఆవిష్కరణలలో శ్రేష్ఠతను ప్రోత్సహించడానికి గీతం నిబద్ధతను ఇది తెలియజేస్తోంది.

# ఎస్సీల వర్గీకరణ ఫలాలు పొందాలంటే ప్రతి ఒక్కరూ చదువుకోవాలి

**ఆసిఫాబాద్ టౌన్ జూన్ 26 (నవజ్యోతి ప్రతినిధి) :**

ఎస్సీ వర్గీకరణ ద్వారా వచ్చే ఫలితాలను పూర్తి స్థాయిలో అందుకోవాలంటే మాదిగ, దాని ఉపకులాల విద్యార్థులంతా ఉన్నత చదువులు చదవాలని ఎమ్మార్పీఎస్, ఎమ్ఎస్పీ జాతీయ నాయకులు రేగుంట కేశవ్‌రామ్ మాదిగ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహ ప్రాంగణంలో 'గో టు విలేజ్' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి మండలంలోని గ్రామగ్రామాన ఎమ్మార్పీఎస్, ఎమ్ఎస్పీ నాయకులు పర్యటిస్తూ, విద్యార్థులకు చదువుపై అవగాహన కల్పిస్తూ వారిని చైతన్యపరుస్తున్నారని పేర్కొన్నారు. మహాత్మా జ్యోతిబాపూలే, సావిత్రీబాయి పూలే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వంటి మహనీయుల ఆశయాల ప్రకారం.. అన్ని రకాల సమస్యల నిర్మూలనకు, అభివృద్ధికి చదువే మూలమని ఆయన స్పష్టం చేశారు. మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు జూలై 7న రాబోయే 32వ ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని తెలంగాణ వ్యాప్తంగా పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించాలని కోరారు. ఆసిఫాబాద్ జిల్లాలోని ప్రతి గ్రామంలో దండోరా గద్దెలను నిర్మించాలని, గద్దెలు లేని గ్రామాల్లో వెంటనే వాటిని ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. మాదిగ, మాదిగ ఉపకులాలు తమ ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడానికి, అలాగే మహాజన రాజ్యాధికార సాధన కోసం మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ప్రతి ఒక్కరూ పోరాడాలని పిలుపునిచ్చారు. జూలై 7వ తేదీన నిర్వహించే ఈ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ప్రతి గ్రామంలో పెద్దలు, మహిళలు, యువకులు, విద్యార్థులు అంతా కలిసి విజయవంతం చేయాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు ఇప్ప నాగరాజు మాదిగ, మాటూరు జయరాజు మాదిగ, మండల నాయకులు కాంపెల్లి రాజలింగు మాదిగ, విద్యార్థి నాయకులు పస్తం బెన్నీ కృష్ణ, హస్తం మోహన్, ముస్లిం మైనారిటీ నాయకులు ఎండీ రఫీక్, బీసీ నాయకులు అదే వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# కేపీహెచ్‌బీ పరిధిలో నేడు విద్యుత్ కోత

కూకట్‌పల్లి, జూన్ 26 ( నవజ్యోతి ప్రతినిధి) : విద్యుత్ లైన్ల అత్యవసర మరమ్మతులు, చెట్ల కొమ్మల నరికివేత పనుల కారణంగా నేడు కేపీహెచ్‌బీ సబ్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టీజీఎస్పీడీసీఎల్ అసిస్టెంట్ ఇంగినర్ బి.వి. ప్రకాశ్ తెలిపారు.

**ఉదయం 9:30 నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు**
**ధనలక్ష్మి ఫీడర్** పరిధిలోని రవి హాస్పిటల్ ప్రాంతం, ప్రసాద్ హాస్పిటల్, రోడ్ నంబర్ 1, ధనలక్ష్మి సెంటర్, ఈడబ్ల్యూఎస్ శివాలయం వీధి, ఎలిఐజి, జీహెచ్ఎంసీ పార్క్, రోడ్ నంబర్ 2, 3 పరిసరాల్లో కోత ఉంటుంది.

**మధ్యాహ్నం 2:30 నుండి సాయంత్రం 5:00 గంటల వరకు**
**కేపీహెచ్‌బీ ఫీడర్** పరిధిలోని హనుమాన్ టెంపుల్, మయూరి ఎస్టేట్స్, 4వ ఫేజ్ మెయిన్ రోడ్, చౌదరి మెస్ ప్రాంతం, వాటర్ ట్యాంక్, శ్యామ్ ముఖర్జీ పార్క్ ప్రాంతాల్లో సరఫరా నిలిచిపోతుంది.




కావున వినియోగదారులు ముందస్తుగా గమనించి సహకరించాలని కోరారు.

# పిల్లలకు తిండి విషయంలో ఆప్షన్ ఇస్తున్నారా? తిప్పతలు తప్పవు..!

ప్రతి తల్లిదండ్రి కూడా తమ పిల్లలను అల్లారుముద్దగా పెంచుతారు. వారి విషయంలో కఠినంగా వ్యవహరించడానికి ఏమాత్రం ఇష్టపడరు. ప్రతి విషయంలో వారికి చాయిస్ ఇస్తారు. ఆహారం విషయంలో కూడా వారికి రకరకాల ఆప్షన్స్ ఇస్తాం. వారు వీరు అని కాదు. ఇంట్లోని ప్రతి ఒక్కరూ చిన్న పిల్లల విషయంలో వారికి కష్టపెట్టడం ఇష్టం లేకనో, వారిపై ఉన్న అమితమైన ప్రేమ వల్లనో వారికి నచ్చింది అందించడానికి ప్రయత్నిస్తారు. 'చిన్నీ.. ఇడ్లీ తింటావా? దోశ తింటావా? ఎగ్ కర్రీ చేయాలా? బీర కాయ కర్రీ చేయాలా?..' ఇలా దాదాపు ప్రతి తల్లీ తమ పిల్లలకు ఆప్షన్లు ఇస్తూనే ఉంటారు. దాదాపు ప్రతి ఇంట్లో ప్రతిరోజూ ఇటువంటి సీనే కనిపిస్తుంది. కానీ ఇది ఏమాత్రం మంచిది కాదని నిపుణులు చెప్తున్నారు. తల్లిదండ్రులు చూపే ఈ ప్రేమ.. పిల్లలపై చెడు ప్రభావం చూపుతాయని అంటున్నారు వైద్య నిపుణులు. ఇది కాలక్రమంలో ఇబ్బందై కూర్చుంటుంది. మీరు ఏది వండినా అది కాకుండా వేరొకటి అడిగే పరిస్థితి వస్తుందని చెప్తున్నారు.

**అయిష్టాలను సీక్రెట్‌గానే ఉంచండి..**

చాలా కుటుంబాల్లో పెద్దవారు కూడా అది తినను, ఇది తినను అంటారు. ఇంట్లో వండి వంటలు తినను అని చెప్పి బయట తినే సమయాలు కూడా ఉంటాయి. అలా మీరు ఏదైనా కూరగాయలు, ఆకుకూరలు, మాంసం, చేపలు, గుడ్లు, చికెన్ వంటివి తిననిపక్షంలో ఆ విషయం చిన్నారులకు తెలియాల్సిన అవసరం లేదు. తెలియకుండా ఉంచడమే మంచిది. వారి ముందు కూడా మీరు మీకు కొన్ని నచ్చవన్న సంగతిని ఇతరులతో చర్చించకుండా ఉండడమే మంచిది. పిల్లలకు తెలిస్తే కొన్నింటిపై అయిష్టంతో వాటిని పక్కన పెట్టొచ్చని గ్రహిస్తారు. తాము కూడా కొన్నింటిని అకారణంగా పక్కన పెట్టేస్తారు. ఒకవేళ అది పౌష్ఠికాహారంలో భాగమైన పదార్థం అయితే ఆ పిల్లలు నష్టపోయిన వారవుతారు.

ఉదాహరణకు బీ12 విటమిన్ మాంసంలోనే దొరుకుతుంది. వారు మటన్ తినడంపై అయిష్టం పెంచుకుంటే ఇక జన్మలో వాళ్లను మీరు మార్చలేరు. అలాగే కొందరు నాకు చికెన్ అంటే ఇష్టం లేదంటారు. మరికొందరు ఫిష్ అంటే ఇష్టం లేదంటారు. ఆకు కూరలు అంటే ఇష్టం లేదంటారు. బీర కాయ వద్దంటారు. ఇందుకు ప్రత్యేక కారణం అంటూ ఏదీ ఉండదు. ఒక్కో కూరగాయకు ఒక్కో ప్రత్యేకత ఉంటుంది. ముఖ్యంగా పిల్లల్లో సక్రమంగా జీర్ణక్రియ సాగేందుకు కూరగాయలు, ఆకుకూరలు తప్పనిసరి అని గమనించాలి.

**ఆప్షన్లు ఇస్తే జరిగేది ఇదే..**

పిల్లలకు రెండేళ్ల వయస్సు వచ్చాక ఇంట్లో పెద్దవారు తినేవి అన్నీ తినిపించవచ్చు. ఏడాది వయస్సు వచ్చినా పెద్దవాళ్ల తినేవి అన్నీ తినిపించవచ్చు. కానీ కాస్త మెత్తటి ఆహారం ఇవ్వాలి. అయితే రెండు మూడేళ్లు ఉన్న పిల్లలకు ఆహారం ఇచ్చేటప్పుడు ఆప్షన్లు అస్సలు ఇవ్వకూడదు. బ్రేక్ ఫాస్ట్ చేస్తావా? లేదా లంచ్ చేస్తావా? డిన్నర్ చేస్తావా? స్నాక్స్ తింటావా? అని మాత్రమే అడగాలి. కానీ బ్రేక్ ఫాస్ట్ చేసేటప్పుడు ఇడ్లీ తింటావా? పూరి తింటావా? ఉప్మా తింటావా? ఇలా ఆప్షన్లు ఇవ్వడం ప్రారంభిస్తే రేపు మీరిచ్చిన అన్ని ఆప్షన్లనూ తిరస్కరిస్తారు. వీలైతే కుటుంబ సభ్యులందరూ కలిసి తినడం వల్ల పిల్లలకు భోజన క్రమశిక్షణ అలవడుతుంది.

**ఆ టైమ్‌లో అస్సలు అడగకండి..**

పిల్లలు టీవీ చూస్తున్నప్పుడు, మొబైల్ చూస్తున్నప్పుడు వారిని తింటావా అని అడకండి. వాళ్లు టీవీలో, మొబైల్‌లో నిమగ్నమవుతారు తప్ప వారు తినే ఆహారాన్ని శ్రద్ధతో తినరు. దీని వల్ల వారు తమ ఆకలిని మించి తినేస్తారు. ఇది చివరకు ఊబకాయానికి దారితీస్తుంది. తిండి తినేటప్పుడు వారు ఏం తింటున్నారో గ్రహింపు ఉండేలా తినడం వారి జీర్ణక్రియకు మేలు చేస్తుంది.

**బలవంత పెట్టొద్దు..**

పిల్లలు తమ నిరసన తెలిపేందుకు పలుసార్లు నేను తిననంటూ మారాం చేస్తుంటారు. ఈ సమయంలో మీరు బలవంతం చేయడం వల్ల ఉపయోగం ఉండదు. వారికి ఆకలి అనిపించినప్పుడు వాళ్లే తింటారు. అలాగే కొందరు తల్లిదండ్రులు బలవంతంగానూ, చిన్నారుల సామర్థ్యానికి మించి తినిపిస్తుంటారు. ఇది కూడా మంచిది కాదు. వారికి ఆహారంపై ఆసక్తి పోయే ప్రమాదం ఏర్పడుతుంది.

**ఆహారం గురించి వివరించండి..**

ఆహారం ప్రాధాన్యతను, విభిన్న రకాల ఆహారాల ప్రాముఖ్యతను పిల్లలకు వివరించండి. వీలైతే విటమిన్లు, వాటి ఉపయోగాల గురించి తప్పకుండా చర్చించండి. అలాగే జంక్ ఫుడ్, షుగర్స్, శాచ్యురేటెడ్ ఫ్యాట్స్ గురించి చెబుతూ అవి చేసే హాని గురించి చర్చించండి.



# భోజనం చేశాకా నీళ్లు ఎందుకు తాగకూడదు?

భోజనం చేసిన తర్వాత నీళ్లు తాగడం చాలా సాధారణం. ప్రతి ఒక్కరికీ ఇదొక అలవాటు కూడా. కానీ కొందరు మాత్రం భోజనం చేసే సమయంలో నీళ్లు తాగకూడదని అంటే మరికొందరు భోజనం చేసిన తర్వాత గంట వరకు నీళ్లు తాగకూడదని మరికొందరు అంటారు. ఆయుర్వేదం కూడా ఇదే విషయం చెప్తోంది. భోజనం చేసిన వెంటనే నీళ్లు తాగకూడదని. సాధారణంగా అయితే నీరు తాగడం మనకు ఎంతో ప్రయోజనకరం. ఇది మనల్ని హైడ్రేటెడ్‌గా ఉంచడమే కాకుండా అవయవాలు సక్రమంగా తమ పని చేయడానికి దోహదపడతాయి. కానీ భోజనం చేసిన తర్వాత తాగితే మాత్రం మేలు చేయకపోగా కీడు చేస్తాయని అంటున్నారు. అసలు భోజనం తర్వాత మంచినీళ్లు ఎందుకు తాగకూడదు. నిపుణులు ఏమంటున్నారు.


**భోజనం తర్వాత నీళ్లు ఇందుకే తాగకూడదు..**

ఆయుర్వేదం చెబుతున్న ప్రకారం ఆహారం తిన్న వెంటనే నీరు త్రాగడం వల్ల జీర్ణరసాలు పలుచగా మారతాయి. దీనివల్ల జీర్ణక్రియ సవ్యంగా సాగదు. అజీర్తి వంటి సమస్యలు వస్తాయి. ఇది నిజమేనని సైన్స్ కూడా చెబుతోంది. భోజనం తిన్న వెంటనే నీరు తాగితే బరువు త్వరగా పెరుగుతారని, ఊబకాయం బారిన పడే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. భోజనం చేసిన తర్వాత వెంటనే నీరు తాగడం వల్ల ఆహారాన్ని జీర్ణం చేయడానికి, జీర్ణవ్యవస్థ తీసుకునే సహజ సమయాన్ని నీరు తాగడం ద్వారా మార్చేస్తున్నట్టే లెక్క. దీనివల్ల ఊహించిన దాని కంటే ముందుగానే ఆకలి వేస్తుంది. అప్పుడు అతిగా తింటారు. కడుపు ఉబ్బరం వంటి సమస్యలు కూడా వస్తాయని చెబుతున్నారు వైద్యులు.

భోజనం తర్వాత శరీరంలో చేరిన నీరు జీర్ణ ఎంజైములను పల్చగా మారుస్తుంది. దీనివల్ల ఎసిడిటీ సమస్య వస్తుంది. గుండెల్లో మంట కూడా రావచ్చు. ఆహారం తిన్న వెంటనే నీరు తాగడం వల్ల జీర్ణం కాకుండా ఆహారం చాలా వరకు మిగిలిపోతుంది. ఇది కొవ్వు రూపంలో నిల్వ అవుతుంది. ఈ ప్రక్రియ ఇన్సులిన్ స్థాయిలను అమాంతం పెంచుతాయి. దీనివల్ల మధుమేహం వచ్చే అవకాశం ఎక్కువగా ఉంది. ఇక మధుమేహం ఉన్నవారు భోజనం తిన్న వెంటనే నీటిని తాగకూడదు. ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతాయి.

**ఎప్పుడు తాగాలి?**

భోజనం తినడానికి అరగంట ముందు, భోజనం తిన్న అరగంట తర్వాత నీరు తాగడం ఉత్తమం అని వివరిస్తున్నారు ఆయుర్వేద వైద్యులు. ఇది ఆహారాన్ని మృదువుగా మారుస్తుంది. అయితే చల్లటి నీటిని మాత్రం తాగకూడదు. ఎందుకంటే అన్నం తిన్న వెంటనే చల్లటి నీరు తాగడం వల్ల జీర్ణక్రియ తీవ్రంగా ప్రభావితం అవుతుంది. జీర్ణవ్యవస్థలో టాక్సిన్స్ పేరుకుపోయే అవకాశం ఉంది. యాసిడ్ రిఫ్లెక్స్ వంటి సమస్యలు కూడా రావచ్చు. అలాగే భోజనం తినేటప్పుడు కెఫీన్ నిండిన పానీయాలు, కూల్ డ్రింకులు కూడా తాగడం మానేయాలి.



# పిల్లలు గుమ్మడికాయ తినడం లేదా.. ఇలా ట్రై చేయండి..!


పిల్లలు ఆహారం విషయంలో చాలా మొండిగా ప్రవర్తిస్తుంటారు. ఫలానా కూరగ తినను అంటే ఇక అంతే.. కొట్టినా తిట్టినా వారు వాటిని తినరు. ఇలా చాలా మంది చిన్నారులు అయిష్టత చూపే కూరగాయల్లో గుమ్మడికాయ కూడా ఒకటని చెప్పొచ్చు. ఇలా ఆహారాన్ని చాలా పర్టిక్యులర్‌గా ఆహారం తినే పిల్లలకు లంచ్ బాక్స్ కట్టాలన్నా, స్నాక్స్ పెట్టాలన్నా, భోజనం తినిపించాలన్నా అదో యుద్ధంలా మారుతుంది. ఇలా గుమ్మడి కాయ అంటే అయిష్టత చూపుతుంటే.. వారి కోసం ప్రత్యేక రెసిపీ ఉంది. ఇలాంటి సందర్భాల్లో మీరు వారికి ఆరోగ్యకరమైన, రుచికరమైన కబాబ్‌లను తయారు చేసి లంచ్ బాక్స్‌లో ప్యాక్ చేయవచ్చు. ఈ రుచికరమైన స్నాక్స్ ను పిల్లల బాక్సుల్లో పెట్టి పంపారంటే పిల్లలు వదలకుండా తినేస్తారు. ఇలా చేయడం వల్ల పిల్లలకు కూరగాయలు తినిపించడం గురించి చింతించాల్సిన అవసరం లేదు. కూరగాయలతో కబాబ్‌లు ఎలా తయారు చేయాలో తెలుసుకుందాం.

**కావలసిన పదార్థాలు:**

అర కప్పు గుమ్మడికాయ, అర కప్పు క్యారెట్ ముక్కలు, అర కప్పు కాలిఫ్లవర్ ముక్కలు, ఒక కప్పు మష్రూమ్స్, ఒక ఉల్లిపాయ, అర కప్పు నానబెట్టిన పెసరపప్పు, వంద గ్రాముల పనీర్, అర కప్పు శెనగపిండి, రెండు పచ్చిమిర్చి, 56 వెల్లుల్లి రెబ్బలు, బాగా తరిగిన కొత్తిమీర, అల్లం ముక్క, రుచికి తగినంత ఉప్పు, ధనియాలు ఒక చెంచా, అర చెంచా నల్ల మిరియాలు, రెండు లవంగాలు, రెండు యాలకులు

**తయారు చేసే విధానం..**

మొదట గుమ్మడికాయ, కాలిఫ్లవర్, క్యారెట్‌లను శుభ్రం చేసి పెద్ద పెద్ద ముక్కలుగా కట్ చేయండి. నానబెట్టిన పెసర పప్పును కూడా శుభ్రం చేసి పక్కన పెట్టుకోండి. ఇప్పుడు ఒక కుక్కర్ తీసుకుని దాంట్లో కట్ చేసిన కూరగాయలు, పెసరపప్పులతో పాటు కట్ చేసిన ఉల్లిపాయను వేసి ఒక విజిల్ వచ్చేవరకూ ఉంచండి. ఇప్పుడు గ్రైండర్ లేదా మిక్సీ జార్‌లో అల్లం, వెల్లుల్లి, పచ్చిమిర్చి, కొత్తిమీర వేయండి. పొడి మసాలా దినుసులు నల్ల మిరియాలు, కొత్తిమీర, లవంగాలు, యాలకులను కూడా వేసి బాగా మెత్తగా మెత్తని పేస్ట్ చేయండి. ఈ మిశ్రమంలోనే ఉడికించిన కూరగాయలను వేసి బాగా కలపండి. నీరు వేయకుండానే కూరగాయల నుండి వచ్చే నీటితోనే దీన్ని కచ్చాపచ్చాగా ఉండే పేస్టులా తయారు చేయండి. ఇప్పుడు ఒక బౌల్‌లో అన్నివేసి పేస్ట్‌లా తయారు చేయండి. తర్వాత దానిలో పనీర్‌ను తురిమి వేయండి. చివరగా దీంట్లోనే శనగపిండి, రుచికి తగినంత ఉప్పు వేసి బాగా కలపండి. తరువాత ఈ మిశ్రమాన్ని చిన్న చిన్న కబాబ్ లాగా చేసి, తక్కువ నూనెలో వేయించండి. రుచికరమైన కూరగాయల కబాబ్‌లు సిద్ధం. ఈ కబాబ్ లను పిల్లలకు పెట్టారంటే వదలకుండా తినేస్తారు. బరువు తగ్గాలనుకునే వారికి కూడా చాలా బాగా సహాయపడుతుంది.



Printed, Published, Owned by MANNE LAXMAN Printed at Saketh Publications, 312, Trinetra Complex, Sangareddy, Telangana 502001 Published from SY. No. 212, Trinetra Complex, Veerabadra Nagar, Sangareddy, Telangana 502001 P.H: 9908123780, Email:navajyothinews@gmail.com, RNI no. TGTEL/25/A2372, EDITOR: MANNE LAXMAN